Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి | సంపుటి (Vol) : 7 | సంచిక (Issue) : 156 | పేజీలు (Pages) : 8 | వెల : రూ. 2.00 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శనివారం, 27 - 12 - 2025

94406 62699 | rajadhanivartalu | rajadhaniv | www.rajadhanivartalu.com | RNI No.: APTEL/2019/77985 | Postal regd: GTR/114/2025-27 | స్థాపితం : 2015

# రౌడీయిజం చేస్తే రాష్ట్ర బహిష్కరణే

**రాజకీయ ముసుగులో నేరాలు చేస్తే చూస్తూ ఊరుకో - పోస్టర్లపై జంతు రక్తం చల్లి భయభ్రాంతులకు గురిచేసే సంస్కృతి ఏమిటి? - గంజాయి, ఎర్రచందనం స్మగ్లింగ్ అరికట్టిన పోలీసులకు అభినందనలు - అతిపెద్ద ఆధ్యాత్మిక క్షేత్రానికి తరలి వచ్చే భక్తులకు భరోసాగా పోలీసులు - తిరుపతిలో నూతన జిల్లా పోలీసు కార్యాలయాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు**






**తిరుపతి, (రాజధాని వార్తలు):** ప్రపంచ ప్రఖ్యాత పుణ్యక్షేత్రం, కలియుగ వైకుంఠమైన తిరుమల పవిత్రతను కాపాడుతూ, భక్తులకు పూర్తి రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు భద్రతా భావం కల్పించే బాధ్యత పోలీసులదేనని సీఎం అన్నారు. తిరుపతిలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన నూతన జిల్లా పోలీసు కార్యాలయాన్ని హోం మంత్రి వి.అనితతో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం అక్కడే ఉన్న విజిటర్స్ పుస్తకంలో సీఎం తన అభిప్రాయాలను, సూచనలను రాశారు. అంతకుముందు సీఎం పోలీసు దళం నుంచి గౌరవ వందనం స్వీకరించారు. టెక్నాలజీని వాడుకుని నేర నియంత్రణ చేయాలని, డ్రోన్ల ద్వారా పెట్రోలింగ్ నిర్వహించి విజువల్ ఆధారాలను సేకరించాలని సూచించారు. నేరస్తుల కంటే పోలీసులు ఎక్కువ ఆలోచించగలగాలని.. వారెన్ని డ్రామాలు ఆడినా టెక్నాలజీ సాయంతో పట్టుకోవాలని స్పష్టం చేశారు. నేరస్తుల కంటే పోలీసులు తెలివిగా వ్యవహరించాలని సీఎం అన్నారు. ఈ విషయంలో విజిబుల్ పోలీసింగ్ ఇన్విజిబుల్ పోలీస్ అనే విధానాన్ని అనుసరించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. కలియుగ వైకుంఠమైన శ్రీవేంకటేశ్వరస్వామి నెలకున్న ఈ ప్రాంత పవిత్రతను కాపాడేలా పోలీసులు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పోలీసు వ్యవస్థ అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భక్తులకు ఎక్కడా చిన్న అసౌకర్యం కలగకుండా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. రౌడీయిజంపై ఉక్కుపాదంరాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి హెచ్చరించారు. కొందరు రాజకీయ ముసుగులో ఉండి రౌడీయిజం చేస్తామంటే కుదరదని... సెటిల్‌మెంట్లు, బెదిరింపులకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. రౌడీయిజం చేసే వారిని రాష్ట్ర బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడితే సొంత పార్టీ వారైనా సరే జైలుకు పంపిన చరిత్ర తమదని సీఎం వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం హయాంలో శాంతిభద్రతలు పూర్తిగా భ్రష్టు పట్టాయని, తిరుమల పవిత్రతను దెబ్బతీశారని విమర్శించారు. రోడ్లు బ్లాక్ చేయటం, రప్పా రప్పా లాడించటం ఏమిటో ఎవరికీ అర్థం కావటం లేదన్నారు. బంగారు పాళ్యంలో మామిడి కాయలు తొక్కించారని.. గుంటూరులో ఓ వ్యక్తిని కాన్వాయ్ కింద తొక్కించి పొదల్లో పారేసి పోయారని అన్నారు. ఆ తర్వాత అంబులెన్సులో తీసుకెళ్లి చంపేశారని వారి బంధువులతో చెప్పించారని సీఎం వ్యాఖ్యానించారు. ఈ తరహా ఘటనల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా ఆధారాలు పెట్టుకోవాలన్నారు. రోడ్లు బ్లాక్ చేయడం, కత్తులతో జంతు బలులు ఇచ్చి పోస్టర్లపై రక్తం చల్లి సమాజాన్ని భయభ్రాంతులకు గురిచేసే సంస్కృతిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ, అసభ్య పోస్టులు పెట్టే వారిపై ప్రభుత్వం నిఘా ఉంచిందని సీఎం తెలిపారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల్లో ఎవరూ ఇలాంటి చర్యలకు పాల్పడటం లేదని, కేవలం రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వంపై కొందరు బురద చల్లే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. తిరుపతిలో గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు కృషి చేస్తున్న పోలీసులను సీఎం అభినందించారు. ఎర్ర చందనం స్మగ్లింగ్ అరికట్టడంలోనూ, పీడీ యాక్టుల అమలులోనూ పోలీసులు చూపుతున్న చొరవను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇంఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్త సహా ఇతర సీనియర్ అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

# సూపర్ మ్యాన్ గురించి కాదు... హనుమాన్ గురించి చెప్పండి

**అవతార్ సినిమా గురించి కాదు... భగవంతుని అవతారాల గురించి వివరించండి - భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ సదస్సులో సీఎం చంద్రబాబు - చరిత్ర, పురాణ పురుషుల గొప్పదం అర్థమయ్యేలా ముఖ్యమంత్రి ప్రసంగం - సీఎం ప్రసంగంతో చప్పట్లతో మార్మోగిన భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ ప్రాంగణం**








**తిరుపతి, (రాజధాని వార్తలు):** భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం అందర్నీ ఆకట్టుకుంది. పురాణాలు.. పురాణ పురుషుల గొప్పదనం గురించి సీఎం చక్కగా వివరించారు. భారత దేశం గొప్పదనాన్ని నేటి తరానికి అర్థమయ్యేలా చెప్పిన చంద్రబాబు ప్రసంగానికి సభికుల నుంచి చక్కటి స్పందన వచ్చింది. భారతీయ విజ్ఞానాన్ని ప్రపంచానికి చాటి చెప్పేలా... మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను మరింతగా పరిఢవిల్లింప చేసేలా కృషి చేస్తున్న భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ 7వ సదస్సు తిరుపతిలో ప్రారంభమైంది. ఇలాంటి సదస్సులో సీఎం చంద్రబాబు చేసిన ప్రసంగం అందరిలోనూ ఆలోచనను రేకెత్తించింది.మన సంస్కృతిని చాటి చెప్పేవి పురాణాలేభారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ సదస్సు ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...“స్పైడర్ మ్యాన్, బ్యాట్ మ్యాన్ వంటివి కాకుండా... మన పురాణాల గురించి పిల్లలకు చెప్పాలి. హాలీవుడ్ సూపర్ హీరోల కంటే మన పురాణ పురుషులు గొప్పవారు.. వారి చరిత్రను వివరించాలి. సూపర్ మ్యాన్ కంటే మన హనుమంతుడు బలవంతుడు... ఆ విషయాన్ని యువతకు, చిన్నారులకు చెప్పాలి. బ్యాట్ మ్యాన్, ఐరన్ మ్యాన్ కంటే మన అర్జునుడు గొప్ప యోధుడు. మన కృష్ణుని మహిమలు, శివుడి మహత్యం గురించి యువతకు బోధించాలి. రాముడిని మించిన పురుషోత్తముడు ప్రపంచంలో ఎవ్వరూ లేరు... రామరాజ్యం గురించి వివరించాలి. అవతార్ సినిమాకంటే మన భారత, రామాయణాలు గొప్పవి.. భగవంతుని అవతారాల గురించి పిల్లలకు వివరించి చెప్పాల్సిన బాధ్యత మనపై ఉంది. బకాసురుడు, కంసమామ లాంటి రాక్షసుల గురించి కూడా చెప్పాలి. ఎవరు మంచి వాళ్లో... ఎవరు చెడ్డవాళ్లో చెప్పగలిగితే మంచికి, చెడుకి వ్యత్యాసాలు పిల్లలకు తెలుస్తాయి. ప్రజలు పురాణాల గురించి మరిచిపోయే సమయంలో ఎన్టీఆర్ ఎన్నో పురాణ గాథలతో కూడిన సినిమాలు చేశారు. విలువలను చెబుతూ సినిమాల ద్వారా చైతన్యం తెచ్చిన మహా నాయకుడు ఎన్టీఆర్. పురాణాలకు, మన సంస్కృతికి అంతటి గొప్పదనం ఉంది. వీటిని పిల్లలకు వివరించి చెప్పినప్పుడే యువత, చిన్నారుల్లో మనో వికాసం కలుగుతుంది. మన దేశ ఔన్నత్యం గురించి తెలుస్తుంది. ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి” అని సీఎం చెప్పారు.

# విద్యార్థులు దేశాన్ని లీడ్ చేయాలి

**- నిమ్మకూరులో గురుకుల పాఠశాలను సందర్శించిన నారా భువనేశ్వరి - గురుకుల విద్యార్థులకు మార్గదర్శనం - రూ.3.50 కోట్లతో నిర్మించిన హాస్టల్ భవనం ప్రారంభం - నిమ్మకూరు నా స్వీట్ మెమరీ: బాల్య జ్ఞాపకాలు పంచుకున్న భువనేశ్వరి - విద్యార్థుల భవిష్యత్తే దేశ భవిష్యత్తు : నారా భువనేశ్వరి**



**కృష్ణాజిల్లా గుడివాడ, (రాజధాని వార్తలు):** విద్యార్థులు సమాజాన్ని, దేశాన్ని లీడ్ చేసేలా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి వ్యాఖ్యానించారు. స్కూల్ చదువు పూర్తి చేసుకుని బయటకు వచ్చే సమయంలో జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శుక్రవారం నిమ్మకూరులోని గురుకుల పాఠశాలలో విద్యార్థులతో భువనేశ్వరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక సూచనలు చేశారు. ముందుగా గురుకుల పాఠశాల ప్రాంగణంలో.... రూ.3.50 కోట్ల పూర్వ విద్యార్థుల విరాళాలతో నిర్మించిన హాస్టల్ భవనాన్ని ప్రారంభించారు. విద్యార్థులతో తన బాల్య స్మృతులను పంచుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు భువనేశ్వరి. విద్యార్థులు ఆంగ్లంలో ప్రతిభ కనబర్చేలా అధ్యాపకులు చూడాలని సూచించారు. తానూ నిమ్మకూరు రావడం స్వీట్ మెమరీ అని.. ఇది మా తాత లక్ష్మయ్య ఊరని చెప్పు కొచ్చారు. చిన్నప్పుడు సెలవులు వస్తే అమ్మ, తమను నిమ్మకూరు పంపించేదని అన్నారు. వేసవి సెలవులకు ఇక్కడికే వచ్చే వాళ్లమని, ఇక్కడ తన సోదరితో కాలక్షేపం చేశానని నారా భువనేశ్వరి గుర్తు చేసుకున్నారు.

# ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త.. సర్కార్ కీలక ఉత్తర్వులు జారీ




**అమరావతి, (రాజధాని వార్తలు):** మెడికల్ అన్ ఫిట్ అయిన ఆర్టీసీ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మెడికల్ అన్ ఫిట్ అయిన ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలివ్వాలని నిర్ణయిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వంలో విలీనం అనంతరం మెడికల్ అన్ ఫిట్ అయిన ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలి వ్వాలని సర్కార్ నిర్ణయించింది. 2020 జనవరి 1 తర్వాత మెడికల్ అన్ ఫిట్ అయిన ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు ఇవ్వనున్నారు. విలీనానికి ముందు మెడికల్ అన్ ఫిట్ అయిన డ్రైవర్లకు మాత్రమే ప్రత్యామ్నాయ ఉద్యోగాలిచ్చే విధానం ఉండదే. ఇకపై ఆర్టీసీలో డ్రైవర్లు, కండక్టర్లు, సహా మిగిలిన ఉద్యోగులందరికీ ప్రత్నామ్నాయ ఉద్యోగాలివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కార్పోరేషన్‌లో ఉండగా 21 కేటగిరీలో మెడికల్ అన్ ఫిట్ అయిన వారికి ప్రత్నామ్నాయ ఉద్యోగాలు ఇవ్వనున్నారు. విలీనం తర్వాత కూడా 21 కేటగిరీల్లో మెడికల్ అన్ ఫిట్ అయిన వారికి ప్రత్యామ్నాయ ఉద్యోగాలు ఇవ్వాలి వ్వాలని సర్కార్ నిర్ణయించింది. మెడికల్ అన్ ఫిట్ అయిన వారికి కండక్టర్, రికార్డు ట్రేసర్, అసిస్టెంట్ మెకానిక్ /శ్రామిక్ ఉద్యోగాలివ్వాలని నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీలో ఇచ్చే ఉద్యోగానికి అర్హత లేకపోతే ప్రభుత్వ విభాగాల్లో అర్హత బట్టి ఉద్యోగాలివ్వాలని ఆదేశాలు జారీ అయ్యాయి. కలెక్టర్ల ద్వారా ప్రభుత్వ విభాగాల్లో అర్హత మేరకు ఉద్యోగాలివ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఏ ఉద్యోగానికీ అర్హత లేని వారికి అదనపు మానిటరీ ప్రయోజనాలు ఇవ్వాలని స్పష్టం చేసింది. మెడికల్ అన్ ఫిట్ వల్ల వాలంటరీ రిటైర్డ్ అవ్వాలనుకునే వారికి అదనపు మానిటరీ ప్రయోజనాలు చేకూరేలా తదుపరి చర్యలు తీసుకోవాలని ఎపీపీటీడీ కమిషనర్‌కు ప్రభుత్వం కీలక ఆదేశాలు ఇచ్చింది. అలాగే తదుపరి చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లా కలెక్టర్లకు సర్కార్ ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి .కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు ఆర్టీసీలో ఉద్యోగులందరికీ ప్రయోజనాలివ్వడంపై ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. మెడికల్ అన్ ఫిట్ అయిన ఉద్యోగులందరికీ ప్రత్నామ్నాయ ఉద్యోగాలివ్వడంపై ఆనందం తెలుపుతున్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు ఆర్టీసీ ఎన్ఎంయూఏ నేతలతో పాటు ఆర్టీసీ ఈయూ, కార్మిక పరిషత్ నేతలు ధన్యవాదాలు తెలియజేశారు.

# గుంటూరు జిల్లాలో గవర్నర్ పర్యటన



**గుంటూరు, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి, మొక్కను అందించిన గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పెదనందిపాడు గ్రామంలోని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి లావు. నాగేశ్వరరావు నివాసానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ సతీ సమేతంగా శుక్రవారం సందర్శనకు విచ్చేశారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ గవర్నర్‌ని మర్యాద పూర్వకంగా కలసి, పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా ఒక మొక్కను అందజేశారు. జిల్లా పోలీస్ విభాగం తరపున గౌరవ గవర్నర్‌కి పోలీస్ గౌరవ వందనం సమర్పించబడింది. అనంతరం జిల్లా ఎస్పీ సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి లావు నాగేశ్వర రావుని కూడా మర్యాద పూర్వకంగా కలసి, స్నేహపూర్వకంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా కలెక్టర్ శ్రీమతి తమీమ్ అన్సారీయా, గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు, సౌత్ డివిజన్ డీఎస్పీ భానోదయ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కాకినాడలో నటి మీనాక్షి చౌదరి సందడి

## - లక్కీ సిగ్నేచర్ మాల్ ప్రారంభం






**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ నగరంలో సంక్రాంతి వస్తు న్నాం సినిమాలో విక్టరీ వెంకటేష్ సరసన నటించిన నటి మీనాక్షి చౌదరి సందడి చేశారు.

గురువారం మెయిన్ రోడ్లో లక్కీ సిగ్నేచర్ ఫ్యామిలీ షో రూంను ఆమె ప్రారంభించి హాజరైన ప్రేక్షకులను తన అభివాదాలు ముద్దు ముద్దు మాటలతో ఆనందపరిచారు. పూర్తి మహిళల కోసం ఏర్పాటు చేసిన ఈ షోరూంలో అందరి శుభాశీస్సులు అందించాలని మీనాక్షి సూచించారు. మహిళల కోసం చీరలు, గాగ్రాలు, లెహంగాలు, ఎన్నో రకాలను అందు బాటు ధరలో అందిస్తోందన్నారు.

నటి మీనాక్షిని చూసేందుకు హాజరైన ప్రేక్షక జనం ఎగబడ్డారు. దీంతో పోలీసులు ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. లక్కీ షో రూంను ఆమె తిరిగి రకర కాల చీరలను తిలకించగా వాటి వివరాలను సిబ్బంది మీనాక్షికి తెలియజేశారు.

# బీసీ ఉద్యోగులు సంఘటితం కావాలి :

## రాష్ట్ర అధ్యక్షులు గుత్తుల వీరబ్రహ్మాం



**కాకినాడ, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ సంఘటితం కావాలని బీసీ/ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుత్తుల వీరబ్రహ్మాం అన్నారు. కాకినాడ జయ రెసిడెన్సిలో ది.25.12.2025 గురు వారం నాడు కాకినాడ జిల్లా బీసీ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు వాసంశెట్టి కామేశ్వరరావు అధ్యక్షతన బీసీ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు గుత్తుల వీరబ్ర హ్మాం విశిష్ట అతిథులుగా డ్వామా, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ తూతిక శ్రీనివాస విశ్వనాధ్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ ది.4.1.2026 ఆదివారం నాడు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బీసీ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 2026 సంవత్సరపు డైరీ మరియు క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్ర మానికి మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖామాత్యులు నారా లోకేష్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని తెలిపారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో విశిష్ట అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీ పల్లా శ్రీనివాసరావు విచ్చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు కింజరపు అచ్చెన్నాయుడు, హౌసింగ్ శాఖ మాత్యులు కొలుసు పార్థసారథి, ఎక్సైజ్ శాఖ మాత్యులు కొల్లు రవీంద్ర, రెవెన్యూ శాఖామాత్యులు అనగాని సత్య ప్రసాద్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మాత్యులు ఎస్ సవిత, వైద్య ఆరోగ్య శాఖ మాత్యులు సత్య కుమార్ యాదవ్, కార్మిక శాఖ మాత్యులు వాసంశెట్టి సుభాష్, ఎన్.ఆర్.ఐ ఎంపవర్మెంట్ అండ్ రిలేషన్ శాఖామాత్యులు కొండపల్లి శ్రీనివాస్ పాల్గొంటారని తెలిపారు. ఏపీడీ శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ హక్కుల సాధన కోసం ఉద్యోగులు అందరు ఐక్యతగా ఉండాలని అన్నారు. ఈ సంద ర్భంగా ఆయన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న బీసీ ఉద్యోగులందరూ జనవరి, 4, 2026 తేదీన వేలాదిగా విజయవాడ తరలి వచ్చి కార్యక్రమాన్ని జయ ప్రదం చేయాలని గుత్తుల వీరబ్రహ్మాం కోరారు. కాకినాడ జిల్లా బీసీ ఓబిసి ఉద్యోగులు సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు చేతుల మీదుగా రాష్ట్ర మహాసభ బ్రోచర్లు ఘనంగా ఆవిష్కరించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జోగా రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అద్దంకి వెంకన్న బాబు, రామ రాఘవ, ముల్లు సత్యనారాయణ, గౌరవ సలహాదారులు దొమ్మేటి సుధాకర్, ప్రొఫెసర్ ఇళ్ళ దోసగిరిరావు సిద్ధి వెంకటేశ్వరరావు, కాకినాడ నగర అధ్యక్షులు కదలి నాగరాజు, వంచర్ల వీరభద్రరావు, డాక్టర్ ఏడుకొండలు, నక్క వెంకటేశ్వర్రావు, వీరవల్లి గోపి కృష్ణ, ములంపాక శ్రీనివాసరావు, మురళి, తేజ, వెంకటేష్ ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్‌లో క్రిస్మస్ వేడుకలు



**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్‌లో క్రిస్మస్ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు..ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రెడ్డిపల్లి రాజేష్ అధ్యక్షతన,కార్యదర్శి డెంకాడ మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రెస్ క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శులు కలిసి క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి, సభ్యులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అధ్యక్షులు రెడ్డిపల్లి రాజేష్ మాట్లాడుతూ, కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్‌లో కుల, మతాలకు అతీతంగా అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ రంజాన్, క్రిస్మస్, ఉగాది వంటి పర్వదినాలను నిర్వహించడం ఆనవా యితీగా కొనసాగుతోందని తెలిపారు. యేసు క్రీస్తు బోధించిన ప్రేమ, శాంతి, సౌహార్దం మార్గాలను ఆచరణలో పెట్టుకుంటూ ప్రెస్ క్లబ్ ముందుకు సాగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ పాత్రికేయులు సాయినాథ్ మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా సౌహార్ద వాతావరణంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్న కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ క్రిస్మస్ వేడుకల కార్యక్రమంలో ప్రెస్ క్లబ్‌కు చెందిన పలువురు సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# 34 వార్డులో క్రిస్మస్ వేడుకలు

## - ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** లోక రక్షకుడు ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని, 34వ వార్డ్ కొబ్బరితోట రెల్లి సంఘం నేత మాధవ్ ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముం దుగా వాసుపల్లి గణేష్ కుమార్‌కు సాలువా కప్పి క్రైస్తవ సోదరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం క్రిస్మస్ వేడుక కేక్‌ను కట్ చేసి క్రైస్తవ సోదరులకు, వైసిపి కుటుంబ సభ్యులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వాసుపల్లి మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ శాంతి, సంతోషం, త్యాగం మరియు కరుణకు ప్రతీక అని పేర్కొన్నారు. సాటి మనుషుల పట్ల ప్రేమ, నిస్సహా యుల పట్ల కరుణ, అపారమైన సహనం మరియు క్షమాగుణం వంటి విలువలను క్రీస్తు మానవాళికి అందించారని, వాటిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో లండ రమణ, లింగం శ్రీనివాస్, గరికిన వెంకటేష్, దూడ అప్పారావు, సిహెచ్ జ్యోతి, సూరడా లక్ష్మణ్ రావు (వైట్), దానియమ్మ, అంబటి అప్పలరాజు, ఎస్. నరసింగరావు తది తరులు పాల్గొన్నారు.

# పోటీ పరీక్షల్లో శ్యామ్ అగ్రగామిగా నిలవాలి : ఎంపీ ఉదయ్ శ్రీనివాస్





**కాకినాడ, (రాజధాని వార్తలు):** పోటీ పరీక్షలకు సంబంధించి అన్ని విభాగాల్లో కాకినాడకు చెందిన శ్యామ్ ఇనిస్టిట్యూట్ అగ్రగామిగా నిలవాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఆకాంక్షిం చారు. ఈ ఏడాది వివిధ పరీక్షల్లో గణనీయమైన ఫలితాలు సాధిం చిందని అదే తరహాలో శ్యామ్ ఖ్యాతి జాతీయ స్థాయికి చేరాలని ఎంపీ తంగెళ్ల అన్నారు. గురువారం శ్యామ్ ఇన్స్టిట్యూట్ ప్రాంగణం లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిజికల్ గ్రౌండ్ను ఎంపీ తంగెళ్లతో పాటుగా ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ)లు ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన వివిధ రకాల ట్రైనింగ్ విభాగాలను పరిశీ లించారు. శ్యామ్ ఇన్స్టిట్యూట్ దినదినాభివృద్ధి చెందాలని తంగెళ్ల, రాజశేఖర్, నానాజీలు కోరారు. శ్యామ్ సంస్థలో విద్యార్థులను ప్రతిభావంతులు గాను, ఉన్నత ఉద్యోగ అవకాశాల్లో తీర్చిదిద్దు తున్న డైరెక్టర్ శ్యామ్ అతని బృందాన్ని కాకినాడ జిల్లా పోలీస్ అదనపు ఎస్పి ఎ శ్రీనివాసరావు అభినందించారు. అనంతరం క్రిస్మస్ కేకును కట్ చేసి అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో శ్యామ్ ఇనిస్టిట్యూట్ సిబ్బంది, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సిటీ ఎమ్మెల్యే కొండబాబు








**కాకినాడ, (రాజధాని వార్తలు):** ప్రభువైన ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే క్రిస్మస్ పర్వ దినం సందర్భంగా క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కాకినాడ జగన్నాథపురంలోని చర్చి స్క్వేర్ సెంటర్ వద్ద గల సెంటినరీ ఆంధ్ర బాప్టిస్ట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిం చిన క్రీస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు సిహెచ్. యేసుదాసు ఎమ్మెల్యే కొండబాబుకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ, ఏసుక్రీస్తు చూపిన ప్రేమ, శాంతి, కరుణ, సహనాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించి సమాజహితానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. అం దరూ సుఖసంతోషాలతో ఆనందంగా క్రిస్మస్ పండుగను జరుపు కోవాలని ప్రార్థిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి వి.సుధారాణి, కోశాధికారి డి.వి.రమణ, వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ కుమార్, సలహాదారులు ఎ.శామ్యూల్, కె. సుభద్రతో పాటు పెద్ద సంఖ్యలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# హెల్మెట్ వాడకం పైన అవగాహన కల్పించిన ట్రాఫిక్ పోలీసులు





**కాకినాడ, (రాజధాని వార్తలు):** ది.25.12.2025వ తేదీన కల్పనా సెంటర్‌నందు వాహన దారులకు మరియు పాదాచారులకు అవగా హన కార్యక్రమం నిర్వహించిన కాకినాడ ట్రాఫిక్ పోలీసులు. మోటార్ సైకిల్స్ నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్/ ధరించాలని ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ చేయ రాదని, రాష్ అండ్ నెగ్లిజెన్స్‌గా డ్రైవ్ చేయరాదని, మాడిఫైడ్ సైలెన్సర్లు వాడరాదని, సెల్‌ఫోన్లో మాట్లాడుతు డ్రైవింగ్ చేయొద్దని, ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా అందరు పాటించాలని మోటార్ వాహనాలు కలిగిన ప్రతి ఒక్కరూ గవర్నమెంట్ వారు జారీ చేసిన నంబర్ ప్లేట్లను మాత్రమే వాడాలని అవగాహన కల్పిం చారు.

సైబర్ నేరలలో భాగముగా ఆన్లైన్ మోసాలు, ఫేక్ లోన్స్ మోసాలు, ఆన్లైన్ జాబ్స్/వర్క్స్ డిజిటల్ అరెస్టు 112/100, 1930, 1972 కాల్స్ యొక్క ఉపయోగములు గురించి వివరిం చినారు. సదరు అవగాహన కార్యక్రమంపై వాహనదారులు, పాదచారులు కాకినాడ పోలీసు వారికి హర్షద్వానాలతో అభి నందనలు తెలియజేసినారు. ఈ కార్యక్రమం నందు ట్రాఫిక్- 1 ఇన్స్పెక్టర్ రమేష్, మరియు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# సింహపురి సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సింహపురి సోషల్ సర్వీస్ ఫౌండర్ షేక్ నయమతుల్లా ఆధ్వర్యంలో నెల్లూరులోని 24వ డివిజన్ కల్లూరుపల్లి, హౌసింగ్ బోర్డ్ కాలనీ నందు సాయి సేవా సదన్ వృద్ధుల ఆశ్రమము నందు అన్నదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండర్ నయమతుల్లా మాట్లాడుతూ...సింహపురి సోషల్ సర్వీస్ ద్వారా ప్రతినెల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మని తెలియజేశారు. రాబోయే రోజుల్లో సింహపురి సోషల్ సర్వీస్ ద్వారా మరెన్నో సేవలు చేపడతామని తెలియజేశారు.

# "కాలానికి కేంద్ర బిందువు చంద్రబాబు" "చంద్రబాబు చుట్టూనే తిరిగే రాజకీయాలు"

## - "అన్ని పార్టీల యుద్ధం? చంద్రబాబుతోనే!" - తెలుగునాట రాజకీయాలకే కేంద్ర బిందువు చంద్రబాబు - టార్గెట్ చంద్రబాబు

**వెంకటగిరి, (రాజధాని వార్తలు):** రాజకీయాల్లో సాధారణంగా పోరాటం పార్టీ–పార్టీ మధ్య జరుగుతుంది. సిద్ధాంతాలు ఢీకొంటాయి. అజెండాలు తలపడతాయి. కానీ తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో మూడు దశాబ్దాలుగా ఒక విచిత్రమైన పరిస్థితి కొనసాగుతోంది. ఇక్కడ పోటీ పార్టీతో కాదు..ఒక వ్యక్తితో..ఆ వ్యక్తే నారా చంద్రబాబు నాయుడు. చంద్రబాబు ఒక ముఖ్యమంత్రి మాత్రమే కాదు. ఒక పార్టీ అధ్యక్షుడు మాత్రమే కాదు. ఒక రాజకీయ కాలానికి కేంద్రబిందువు. అందుకే ఆయనపై దాడి చేస్తే రాజకీయ లాభం ఉంటుందన్న అపోహ అన్ని పార్టీల్లోనూ బలంగా పాతుకుపోయింది. కాంగ్రెస్ అయినా, బీజేపీ అయినా, వైసీపీ అయినా, బీఆర్ఎస్ అయినా వ్యూహాలన్నింటిలో ఒకే పేరు తిరుగుతుంది. అదే చంద్రబాబు. ఇది యాదృచ్ఛికం కాదు. 1995లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి చంద్రబాబు రాష్ట్ర రాజకీయాల దిశనే మార్చారు. పాత పాలనా ధోరణులకు తెరదించి సాంకేతికత, అభివృద్ధి, గ్లోబల్ విజన్‌ను రాజకీయాల్లోకి తెచ్చారు. అప్పటి నుంచి ఆయన ప్రత్యర్థి ఎవరు అన్నది కాదు ఆయనే ప్రత్యర్థి అన్న భావన ఏర్పడింది. 1996 నుంచి 1999 మధ్య కేంద్రంలో కాంగ్రెస్సేతర ప్రభుత్వాలు ఏర్పడడంలో చంద్రబాబు కీలక పాత్ర పోషించారు. దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన రాష్ట్ర



నాయకుడిగా గుర్తింపు పొందారు. అందుకే కేంద్రంలోనూ ఆయనను విస్మరించడం సాధ్యం కాలేదు. 2004లో అధికారం కోల్పోయినా ఆయన రాజకీయ ప్రాధాన్యత తగ్గలేదు. కాంగ్రెస్ కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్నా వారి రాజకీయ టార్గెట్ చంద్రబాబే. ఆయనను ఓడించడానికి కాంగ్రెస్, మజ్లీస్, వామపక్షాలు, టీఆరెస్ - alliance కట్టాయి. ఒక వ్యక్తిని ఎదుర్కోవడానికి అంతటి రాజకీయ సమీకరణ అవసరమైంది అంటే అది చంద్రబాబు స్థాయిని చాటుతుంది. 2014లో బీజేపీతో కలిసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు విభజన అనంతర ఆంధ్రప్రదేశ్‌కు దిశ చూపే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో సహాయం జరగలేదన్న విమర్శలు ఉన్నా ఆ విమర్శల కేంద్రం లోనూ ఉన్నది ఆయన మాత్రమే. 2018లో ఎన్డీఏ నుంచి బయటకు వచ్చిన తర్వాత బీజేపీ–వైసీపీ రాజకీయ అవగాహన స్పష్టంగా కనిపించింది. 2019లో జరిగిన ఓటమి వ్యక్తిగత పరాజయం కాదు. అది రాజకీయ సమీకరణాల ఫలితం. అయినా 2019 నుంచి 2024 మధ్య పాలనపై ప్రజల్లో ఏర్పడిన అసంతృప్తి రాజకీయ వాస్తవాన్ని బయటపెట్టింది. అవినీతి, దౌర్జన్యం, పరిపాలనా వైఫల్యాలు ప్రజలకు స్పష్టంగా కనిపించాయి. అదే సమయంలో తెలంగాణలో టీఆరెస్ ఓటమి కేంద్రంలో బీజేపీ బలం తగ్గడం దేశ రాజకీయాల్లో మారుతున్న గాలి దిశను సూచించాయి. ఈ పరిస్థితుల్లో బీజేపీకి చంద్రబాబు అవసరమయ్యారు. అది రాజకీయ లాజిక్. చంద్రబాబు మద్దతు లేకుండా కేంద్రంలో మూడోసారి ప్రభుత్వం సాధ్యం కాదన్న వాస్తవాన్ని దేశ రాజకీయాలు స్పష్టంగా నిరూపించాయి. ఇది ఒక విషయం తేల్చి చెప్పింది. చంద్రబాబు రాజకీయంగా అప్రస్తుతం కాలేదు. అతడు ఇప్పటికీ కేంద్రబిందువే. రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నా రాజకీయ చర్చ చంద్రబాబు చుట్టూనే తిరుగుతుంది. ఆయన అధికారంలో ఉంటే అడ్డుకోవడమే లక్ష్యం. ఆయన ప్రతిపక్షంలో ఉంటే గొంతు నొక్కడమే వ్యూహం. కేసీఆర్ అయినా, జగన్ అయినా, మోదీ అయినా, అమిత్ షా అయినా వారి రాజకీయ గణనల్లో చంద్రబాబు పేరు లేకుండా కథ పూర్తి కాదు. ఆయనపై విమర్శ లేకపోతే ప్రెస్ మీట్లు వెలవెలబోతాయి. ప్రసంగాలు అసంపూర్తిగా అనిపిస్తాయి. ఇదే రాజకీయ వాస్తవం. వయసు పెరిగినా పట్టుదల తగ్గలేదు. కేసులు పెట్టినా వ్యక్తిగత దూషణలు చేసినా రాజకీయ కక్షతో ఇబ్బంది పెట్టినా చంద్రబాబు నిలబడ్డ తీరు ఒక రాజకీయ మేరు పర్వతం. ఎన్ని దాడులు చేసినా ఆయనను ఒంటరి చేయాలనుకున్న ప్రతిసారి ప్రజలు ఆయనకు మరింత దగ్గరయ్యారు. అందుకే "టార్గెట్ చంద్రబాబు" ఒక నినాదంగా మారింది. ఒక వ్యూహంగా మారింది. కానీ ఆ వ్యూహాలన్నింటినీ తట్టుకుని నిలబడ్డ నాయకుడే చంద్రబాబు నాయుడు.

# దివ్యాంగుల్లో క్రీడా స్ఫూర్తిని నింపడమే వీల్ చైర్ రగ్బీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యం

## - అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బండారు దుర్గారావు - నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో అట్టహాసంగా వీల్ చైర్ రగ్బీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ మొట్టమొదటి సమావేశం - రాష్ట్ర కమిటీకి ఎన్నికైన నెల్లూరుకు చెందిన ముగ్గురు దివ్యాంగ క్రీడాకారులు







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విభిన్న ప్రతిభావంతుల్లో క్రీడా స్ఫూర్తిని వెలికితీసి వారిలో ఆత్మవిశ్వాసం కలిగించేలా ప్రోత్సహిస్తున్నట్లు వీల్ చైర్ రగ్బీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ప్రెసిడెంట్ బండారు దుర్గారావు తెలియజేశారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో లివీల్ చైర్ రగ్బీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ( రిజిస్ట్రేషన్ నెంబర్ 470/2025) మొట్ట మొదటి రాష్ట్ర సమావేశం అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బాబు యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రంజేష్ కుమార్, స్పోర్ట్స్ డైరెక్టర్ మహబూబ్ సాహెబ్ (డౌలాభాష) ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ముందుగా క్రీడాకారులకు స్వాగతం పలుకుతూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అసోసియేషన్ నూతన కమిటీని ప్రకటించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఇందులో భాగంగా తొలుత వీల్ చైర్ రగ్బీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేసిన లక్ష్యాన్ని క్రీడాకారులకు తెలియజేశారు. తదనంతరం వీల్ చైర్ రగ్బీ, సిట్టింగ్ క్రికెట్, సిట్టింగ్ వాలీబాల్ క్రీడాకారుల నైపుణ్యాన్ని పరిశీలించారు. ఈ క్రమంలో క్రీడాకారులు అంతా కలుసుకొని నూతన అసోసియేషన్ సభ్యులను ఘనంగా సాలువాలతో సత్కరించారు. నెల్లూరు నుంచి రాష్ట్ర కమిటీకి ఎన్నికైన ముగ్గురు దివ్యాంగ క్రీడాకారులను అభినందించారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులంతా సహబంతి భోజనం చేశారు. ఈ సందర్భంగా లివీల్ చైర్ రగ్బీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు బండారు దుర్గారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టాలెంట్ ఉన్న దివ్యాంగ క్రీడాకారులను వెలుగులోకి తీసుకొచ్చి వారి జీవితాల్లో వెలుగు నింపడం కొరకు అసోసియేషన్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. వీల్ చైర్ రగ్బీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు ఇచ్చిన ఆదేశాల మేరకు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మరియు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వారి సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వీల్ చైర్ రగ్బీ క్రీడని విస్తరింప చేస్తూ ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జిల్లా కమిటీలను ఏర్పాటు చేసి వారి ద్వారా ప్రతిభ మరియు ఆసక్తి కలిగిన దివ్యాంగ క్రీడాకారులను వెలికి తీసి వారి జీవితాలను వెలుగులు నింపడానికి తగు చర్యలు చేపడతామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్పోర్ట్స్ పాలసీని దృష్టిలో ఉంచుకొని మిగతా స్పోర్ట్స్ సంఘాలైన పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్, పారా సిట్టింగ్ వాలీబాల్ అసోసియేషన్ ఆంధ్ర ప్రదేశ్, వీల్ చైర్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్, వీల్ చైర్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్, ఫిజికల్లీ చాలెంజ్ చెస్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న అన్ని దివ్యాంగ క్రీడా సంఘాలతో కలిసి పని చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే దివ్యాంగ క్రీడాకారులందరికి అన్ని వసతులు, క్రీడా ప్రాంగణాలు, క్రీడా పరికరాలు ప్రోత్సాహ బహుమతులు ప్రభుత్వం నుంచి వచ్చే విధంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో కృషి చేయడం జరుగుతుందని బండారు దుర్గారావు తెలిపారు. అనంతరం వీల్ చైర్ రగ్బీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాబు యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రంజేష్ కుమార్, వీల్ చైర్ క్రికెట్ ప్లేయర్ కే. పెంచలయ్య మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పారా స్పోర్ట్స్ జిల్లా సెక్రెటరీ కటారి యాదగిరితో పాటు పలువురు వక్తలు మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో నైపుణ్యాన్ని ప్రదర్శించిన విభిన్న ప్రతిభావంతులను అభినందించారు. మరింతగా రాణించి ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వీల్ చైర్ రగ్బీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (రిజిస్ట్రేషన్ నెంబర్ 470/2025) రాష్ట్ర కమిటీ : 1. రాష్ట్ర అధ్యక్షులు: బండారు దుర్గారావు, 2. రాష్ట్ర ఉపాధ్యక్షులు: చీర్ల బాబు యాదవ్ (నెల్లూరు), 3. వర్కింగ్ ప్రెసిడెంట్: గూడూరు రంజేష్ కుమార్ (నెల్లూరు), 4. జనరల్ సెక్రెటరీ: బొమ్మన బోయిన రమేష్, 5. ట్రెజరర్: మురికిపూడి సురేంద్రబాబు, 6. స్పోర్ట్స్ డైరెక్టర్: షేక్ మహబూబ్ సాహెబ్ (డౌలా సాహెబ్) (నెల్లూరు), 7. జాయింట్ సెక్రెటరీ: జక్కిరెడ్డి శివారెడ్డి, 8. ఎగ్జిక్యూటివ్ నెంబర్: కాకునూరి శ్రీనివాసరావు, 9. ఎగ్జిక్యూటివ్ నెంబర్: దేవళ్ళ రామయ్య. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ స్టేట్ ట్రెజరర్ ఎం.సురేంద్రబాబు, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ శ్రీనివాసులు, రామయ్య, పారా స్పోర్ట్స్ జిల్లా సెక్రెటరీ యాదగిరి, స్విమ్మర్ బాబురావు, విభిన్న ప్రతిభావంతులైన క్రీడాకారులు ముత్తుకూరు శ్రీనివాసులు, కమలాకర్, సుబ్రహ్మణ్యం, సుధీర్, సునీల్, వెంకటేష్, కృష్ణ ప్రసాద్, సాయి గౌతమ్, బ్యాంకు శీను, వలిపి శ్రీనివాసులు, మహిళా క్రీడాకారిణి కూనపురెడ్డి అరుణ, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడలో లక్కీ సిగ్నేచర్ మాల్‌ను ప్రారంభించిన సినీనటి మీనాక్షి చౌదరి





**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ నగరంలో కొత్తగా ఏర్పాటు చేసిన 'లక్కీ సిగ్నేచర్' మాల్‌ను సినీనటి మీనాక్షి చౌదరి ఘనంగా ప్రారంభించారు. ఇటీవల సంక్రాంతి రాబోతున్నాం సినిమాలో విక్టరీ వెంకటేష్ సరసన నటించిన మీనాక్షి చౌదరి ఈ కార్యక్రమానికి హాజరు కావడంతో సందడి నెలకొంది. ఈ షోరూంలో కేవలం మహిళల కోసం మాత్రమే ప్రత్యేక వస్త్రాలు అందు బాటులో ఉన్నాయి. తాజా ట్రెండ్‌కు తగ్గ చీరలు, లెహంగాలు, గాగ్రాలు, మరెన్నో వర్గాల్లో విస్తృత కలెక్షన్లు అందుబాటు ధరల్లో లభిస్తాయని నిర్వాహకులు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్ర మంలో సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, మూత లక్ష్మీ గోపాలకృష్ణ, ఈశ్వరమ్మ, సమీర, సునీత, కాకరపర్తి ఆదిలక్ష్మి, పెంటపాటి తాయారు, రత్తయ్య, శ్రీను, స్వామి తదితరులు పాల్గొన్నారు.



# పెంకె శ్రీనివాస్ బాబాకి శుభాకాంక్షలు తెలిపిన బీసీ నాయకులు

**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా కార్యదర్శిగా నియమితులైన పింకే శ్రీనివాస్ బాబాకి రాష్ట్ర బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ యనమదల రవి కార్యదర్శి పెంకి రాజు కొమ్మన తాతారావు విన్నకోట వెంకటేష్ మర్యాదపూ ర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే కాలంలో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు.

# మాజీ మంత్రి స్వర్గీయ మెట్లకు నివాళులు అర్పించిన ఎమ్మెల్యే, ఎంపీ



**అమలాపురం, (రాజధాని వార్తలు):** మాజీ మంత్రి స్వర్గీయ డాక్టర్ మెట్ల సత్యనారాయణరావుకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఎంపీ హరీష్ బాలయోగిలు ఘనంగా నివాళులర్పించారు. డాక్టర్ మెట్ల వర్ధంతి సందర్భంగా గురువారం అమలాపురం నల్లవంతెన వద్ద స్వర్గీయ డాక్టర్ మెట్ల విగ్రహానికి, అనంతరం కిమ్స్ ఎదురుగా ఉన్న మెట్ల ఘాట్ వద్ద మెట్ల చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కోన సీమలో పెద్దాయనగా పిలుచుకునే మెట్ల సత్యనారాయణరావు సేవలను, జ్ఞాపకాలను కోనసీమ ప్రాంత అభివృద్ధికి, కోనసీమ ప్రజలకు మెట్ల చేసిన సేవలను ఎన్నటికీ మరువలేవని కొనియాడారు. మెట్ల రమణబాబు ఆధ్వర్యంలో నాయకులు ర్యాలీగా బయలుదేరి మెట్ల సత్యనారాయణ రావు ఘాట్‌కు చేరుకుని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణ బాబు, నాయకులు తిక్కిరెడ్డి నేతాజీ, వలవల శివరావు, భాస్కర్ల రామకృష్ణ, నల్లా చిట్టిబాబు, చిక్కాల గణేష్, బత్తుల సాయి, మాడా మాధవి,ఆశెట్టి ఆదిబాబు, జంపన సుమన్ వర్మ, నల్లా మల్లిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# చేమూరు గ్రామానికి సీసీ రోడ్ల శుభారంభం - ప్రజల చిరకాల సమస్యకు పరిష్కారం



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** గ్రామాల అభివృద్ధికి బాటలు వేస్తూ పల్లె పండుగ 2.0 తో సుపరిపాలన అని, చేమూరు గ్రామానికి సీసీ రోడ్ల శుభారంభమని, ప్రజల చిరకాల సమస్యకు చక్కని పరిష్కారమని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఒక్క రోడ్డు కూడా వేయని దుస్థితి నుంచి, నేడు అభివృద్ధి దిశగా చేమూరు పంచాయతీ అడుగులు వేస్తోందన్నారు. తొట్టంబేడు మండలం, చెమూరు గ్రామంలోని అన్ని వీధుల్లో సుమారు రూ. 25 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో చేమూరు పంచాయతీనందు సీసీ రోడ్లకు భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో సరైన రోడ్లు లేక ప్రజలు ఎన్నో అవస్థలు ఎదుర్కొన్నారని, ఇచ్చిన మాట ప్రకారం గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఆధునీకరించిన సీసీ రోడ్ల నిర్మాణాన్ని ప్రారంభించామని శాసన సభ్యులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రతి పల్లెకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించి, గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. చేమూరు గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణంతో ప్రజలకు రాకపోకల సమస్యలు తొలగిపోతాయని, గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని అన్నారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కూటమి నాయకులు మునిరాజా నాయుడు, శంకర్ నాయుడు, కొన్నలి రమేష్,, కార్య కర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పండుగ వాతావరణాన్ని సృష్టించారు. తమ సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.


# సంపాదకీయం

## ఇది సకాలపు సబబేనా

జిలుగు వెలుగుల భారత్ గురించి మనం వినని రోజంటూ ఉండదు. ఉరుకులు పరుగులు తీస్తున్న మన ఆర్థిక వ్యవస్థ గురించీ, క్రమం తప్పకుండా ఐదేళ్లకొక సారి శాంతియుతంగా ప్రభుత్వాలను మార్చుకుంటున్న మన ప్రజాస్వామ్యం ఘనత గురించీ ఇంటా బయటా చాలా ప్రశంసలూ వినపడతాయి. ప్రశంసలన్నిటినీ వొట్టి ప్రచారాలుగా, అతిశయోక్తులుగా కొట్టేయటం తేలిక! విశ్లేషించటమే కష్టం! వాస్తవాలనూ ప్రశంసలనూ తక్కెడలో పెట్టి ఒకదానికొకటి సరిగ్గా తూగుతున్నాయా? లేదా? అని బేరీజు వేసుకుంటే దిద్దుబాట్ల అవసరాలు కనపడతాయి. వాటికి సంసిద్ధతను వ్యక్తం చేయటమే ఇప్పుడున్న పరిస్థితుల్లో చాలా సాహసంతో కూడిన పని! ఆరోగ్యకరమైన, నిర్మాణాత్మక విమర్శలు చేయటానికి ప్రజాస్వామ్యాల్లో కూడా ఏటికి ఎదురీదాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. భావప్రకటనా స్వేచ్ఛకు తిరుగులేదన్న దేశంగా పేరొందిన అమెరికాలో కూడా దానికి వ్యతిరేక వాతావరణం విజృంభిస్తోంది. వ్యక్తుల సామాజిక మాధ్యమాల ఖాతాలను జల్లెడపట్టి ప్రభుత్వ వ్యతిరేక, అనుకూల భావాల వారీగా చిట్టాలను రూపొందిస్తున్నారు. అమెరికా విధానాలను ఎప్పుడో ఒకప్పుడు విమర్శించినవారూ, ఇప్పటికీ వాటితో ఏకీభావం లేనివారూ సైతం తగిన జాగ్రత్తలు తీసుకోవటంలో తలకిందులై పోతున్నారు! అక్కడ సంగతి సరే.. మరిక్కడ సంగతేంటని ప్రశ్నించుకుంటే సంతృప్తికరమైన జవాబు లభించదు. రాజకీయాలనూ, ఆర్థిక విషయాలనూ నిర్మొహమాటంగా చర్చించటం అరుదైపోతోంది. రాజకీయంగా మావైపో, ఆవలివైపో అన్న ధోరణే ప్రబలిపోతోంది. దీనికి భిన్నంగా సమస్యలను సామాజిక, ఆర్థిక, న్యాయ దృష్టితో అంచనా వేయటం, మెరుగైన ముందడుగులు సూచించటం ఎవరైనా చేస్తే సకాలపు సబబుగా భావించాల్సి వస్తోంది. రాజకీయ, ఆర్థిక విశ్లేషణలో ఇప్పటికే గణనీయంగా కృషిచేసిన ఇద్దరు అధ్యాపకులు అతుల్ కోహ్లీ, కాంతా మురళి 'డెమొక్రసీ అండ్ ఇనీక్వాలిటీ ఇన్ ఇండియా' అన్న తమ తాజా రచనతో ఆ పనిని సమర్థంగా చేశారు. స్వాతంత్ర్యం సాధించిన నాటి నుంచి ఇప్పటివరకూ భారత్ చాలా కష్టతరమైన ప్రయాణాన్నే చేసింది. సాధించిన గణనీయ విజయాలూ ఉన్నాయి. గట్టిగా ఆశించినా చేరుకోలేని గమ్యాలూ ఉన్నాయి. మతతత్వంతో మొదటికే మోసంవస్తోన్న ప్రమాదాలూ నెలకొంటున్నాయి. వీటి వెనకున్న రాజకీయాలనూ, వాటితో ప్రభావితమవుతోన్న ఆర్థికరంగాన్నీ మనం లోతుగా అర్థం చేసుకోవటమే అసలు సమస్య. దేన్నైనా ఏ దృక్పథంతో అర్థం చేసుకోవాలన్నది ఎప్పుడూ చిక్కుసమస్యగానే ఉంటుంది. మతదృక్పథంతో ప్రపంచాన్ని చూడటం ఒక రకంగా తేలికైన పని! కష్టాలకూ, నష్టాలకూ, అర్థాలకూ, అనర్థాలకూ, అసమానతలకూ, అదృష్టాలకూ, దురదృష్టాలకూ, అధోగతులకూ, పురోగతులకూ.. ఒక సకలాతీతశక్తినే కారణంగా భావిస్తే, అన్నిటిలోనూ యథాతథస్థితిని ఆమోదిస్తూ కాలాన్ని వెళ్లదీయొచ్చు. కానీ కాలమే మనిషిని ఆ తరహా ఆలోచనల్లో నిలువనీయటం లేదు. పాలనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించే ప్రజాస్వామ్య రాజకీయాలు, ఆర్థిక అసమానతలను ఒక పరిమితిలో ఉంచాలనే ఆధునిక దృక్పథాలు బలపడుతోన్న ప్రపంచంలో.. ఎక్కడి పరిస్థితులనైనా వాటికి అనుగుణంగానే విశ్లేషించాలన్న వివేచనే పదునుతేలుతోంది. పజల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచటానికి తోడ్పడాల్సిన రాజకీయాల్లో కుల, మత అస్తిత్వాల ప్రాధాన్యం పెరగటం, ఆర్థిక అసమానతలు ఏ దేశంలో లేనంతగా పెట్రేగటం భారత్‌కు పెనుసవాళ్లుగా మారాయి. ఆర్థిక ప్రగతికి ప్రభుత్వ విధానాలు దోహదం చేసి.. పరిశ్రమలు, సంస్థల ఏర్పాటులో ప్రభుత్వం క్రియాశీలకపాత్ర పోషించి.. అవసరమైన చోట స్వయంగా స్థాపించి.. అభివృద్ధిఫలాలు అన్ని వర్గాలకూ హేతుబద్ధంగా అందేలా కృషిచేయాలన్న లక్ష్యం 1980ల వరకూ దేశంలో ఎంతోకొంత ఉండేది. ఆ తర్వాత నుంచీ ప్రభుత్వాలు క్రమేపీ ఆ పాత్ర నుంచి తప్పుకొని ఆర్థికాభివృద్ధిని సాధించే లక్ష్యం ప్రైవేటు పరిశ్రమాధిపతులదిగా, వ్యాపారవేత్తలదిగా మాత్రమే భావించటంతో కీలకమార్పులు రావటం మొదలయ్యాయి. పరిశ్రమలకు కావాల్సిన సౌకర్యాలను కల్పించటం, వాటికి వనరులను కేటాయించటం, పన్ను రాయితీలు ఇవ్వటం, వాటిల్లో పెట్టుబడులకు ఆహ్వానాలు పలకటం.. ప్రభుత్వాలకు ఏకైక ప్రాధాన్యంగా మారింది. దాని ఫలితంగా ఆర్థికాభివృద్ధి పెరిగింది. అందులో సందేహం లేదు. పెరిగిన సంపదకు అనుగుణంగా ఆదాయ పంపిణీలో న్యాయమూ జరిగి ఉంటే మన రాజకీయాలు కుల, మతతత్వాలకు దూరంగా ఉండేవి. ఆర్థికాభివృద్ధి సాధనను ప్రధానంగా పరిశ్రమాధిపతులకూ, వ్యాపారవేత్తలకూ వదిలివేస్తూ వారికి అన్నివిధాలుగా అండదండలు అందించటంతో పాటు వారు సమకూర్చే నిధులతో.. విరాళాలతో మాత్రమే పార్టీలను నడిపే పరిస్థితి రావటంతో రాజకీయ రంగంలో ప్రజలను సమీకరించే పద్ధతులే మారిపోయాయి. ఆర్థిక అంశాల ఆధారంగా ప్రజలను ఆకర్షించలేని నిస్సహాయ స్థితిలోకి పార్టీలు పడిపోయాయి. అన్నింటా పైవర్గాలపై ఆధారపడిన పార్టీలకు కింది, మధ్యతరగతి వర్గాల ఓట్లను వదులుకునే పరిస్థితి మాత్రం లేదు. సోషలిజం, సంక్షేమరాజ్య భావనలను 1980ల నుంచి అన్ని పార్టీలూ వదులుకున్నాయి. నినాదప్రాయంగా అప్పుడప్పుడూ వాడినా విధానాల్లో, ఆచరణలో వాటిని పూర్తిగా పక్కనపెట్టారు. 1980లో ఇందిరాగాంధీ రెండోసారి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మొదలైన సంపూర్ణ వ్యాపారానుకూల విధానాలను 1991లో విపరీతంగా సరళీకృతం చేశారు. వీటి అమల్లో పార్టీలపరంగా తేడాలు లేకపోయినా ఎన్నికల ద్వారానే అధికారంలోకి రావాలి కాబట్టి జనసమీకరణకు కొన్ని పార్టీలు కులంవైపు మొగ్గితే, బీజేపీ పూర్తిగా మతం వైపు మొగ్గింది.

# విశాఖలోని ట్రినిటీ లూథరన్ చర్చ్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

## - ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీ అసెంబ్లీ స్పీకర్ - చంద్రబాబు నాయకత్వంలో క్రైస్తవ సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** క్రిస్మస్ అనేది కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, అది ప్రేమ, క్షమ, త్యాగం, సేవ అనే విలువలను మన జీవితాల్లో నాటే మహా పర్వదినమని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం విశాఖపట్నం, సూర్యాబాగ్ ప్రాంతంలోని ట్రినిటీ లూథరన్ చర్చ్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చర్చ్ పెద్దలు, పాస్టర్లు స్పీకర్‌ను సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జరిగిన సభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు, క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. యేసుక్రీస్తు జననం రాజమహల్‌లోనో, బంగారు భవనాల్లోనో జరగలేదని, సామాన్యుల మధ్య పశువుల పాకలో ఆయన జన్మించడం ద్వారా అహంకారం కంటే 'వినయం' గొప్పదని ప్రపంచానికి చాటిచెప్పారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవుల అభివృద్ధికి, చర్చిల నిర్మాణానికి, మరియు పండుగ కానుకలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పీకర్ హామీ ఇచ్చారు. ఈ క్రిస్మస్ మరియు రాబోయే నూతన సంవత్సరం ప్రతి ఇంటా కొత్త వెలుగులు నింపాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వాక్యం అందించడానికి వచ్చిన డాక్టర్ ఎన్.జేసు రత్నకుమార్, చర్చ్ పాస్టర్లు, కన్వీనర్ సుష్ బాబు, కో-కన్వీనర్ వి.ఎన్.మూర్తి, అడ్-హక్ కమిటీ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.


# క్రిస్మస్ సందర్భంగా పలు చర్చిలలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

## - ఏసుప్రభు బోధనలు ప్రపంచానికి మార్గం చూపాయన్న ఎమ్మెల్యే




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** క్రిస్మస్ శుభ సందర్భంగా జనసేన పార్టీ విశాఖపట్నం నగర అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ పలు ప్రాంతాల్లో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. రామాటకీస్ వద్ద క్రిస్ట్ ఫస్ట్ చర్చ్ ప్రార్థనలో పాల్గొని, నూతన సంవత్సర క్యాలెండర్ ను పాస్టర్ కిరణ్‌తో కలసి ఆవిష్కరించారు. అదేవిధంగా 39 వ వార్డు, రీడింగ్ రూమ్ ప్రాంతంలో ఉన్న లండన్ చర్చ్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ శుభాకాంక్షలతో పాటు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం 30 వ వార్డు అఫీషియల్ కాలనీలో బిజెపి నేత ఆల్బర్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అదేవిధంగా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వాజ్పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆయా వార్డుల కార్పొరేటర్లు, కూటమి శ్రేణులు, చర్చి పాస్టర్లు పాల్గొన్నారు.

# ఘనంగా కరప మండలంలో క్రిస్మస్ వేడుకలు

**కరప, (రాజధాని వార్తలు):** మండల కేంద్రం కరప, వేళంగి, కొరిపల్లె, గొడ్డటిపాలెం, అరట్లకట్ట తదితర గ్రామాల్లో క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని చర్చిలన్నీ ప్రత్యేక అలంకరణలతో ముస్తాబయ్యాయి. క్రిస్టియన్ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు, కీర్తనలతో పండుగ ఉత్సాహాన్ని నింపారు. క్రిస్మస్ వేడుకలలో భాగంగా ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) ఆదేశాల మేరకు పంతం సందీప్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు మండలం వ్యాప్తంగా ఉన్న చర్చిలకు, క్రిస్టియన్ కుటుంబాలకు కేకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కరప మండలంలో మొత్తం 141 చర్చిలు ఉన్నాయని, గత నాలు గేళ్లుగా ప్రతి క్రిస్మస్ సందర్భంగా కేకులు పంచుతూ క్రిస్టియన్ సోదరులతో కలిసి వేడుకల్లో పాల్గొంటున్నామని తెలిపారు. ఎమ్మెల్యే నానాజీ సూచనల మేరకు క్రిస్టియన్ సోదరులతో ఐక్యత, సోదర ప్రేమను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే నానాజీ



తనయుడు పంతం సందీప్ నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని పేర్కొన్నారు. చర్చిల వద్ద కేకులు కట్ చేయడంతో మండలమంతటా ఐక్యత, సోదర భావంతో కూడిన పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కూటమి నాయకులు, జనసైనికులు, కార్యకర్తలు, చర్చ్ ఫాదర్లు, క్రిస్టియన్ సోదరులు, గ్రామ పెద్దలు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మాజీ మంత్రి స్వర్గీయ డాక్టర్ మెట్లకు ఘన నివాళి



**అమలాపురం, (రాజధాని వార్తలు):** మాజీమంత్రి స్వర్గీయ డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు వర్ధంతి సందర్భముగా పలువురు ఘనంగా నివాళులర్పించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని మెట్ల సత్యనారాయణ రావు ఘాట్ వద్ద గురువారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి శుభాష్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, అమలాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు యాళ్ళ వెంకటరామ మోహన్‌రావులు మెట్ల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బీజేపీ పూర్వ ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షులు అడపా శ్రీను, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకర సాయి, అరిగెల తేజ వెంకటేష్, బండి శ్రీనివాస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# యేసు క్రీస్తు బోధనలతో సమాజంలో శాంతి, ఐక్యత

## - క్రిస్మస్ వేడుకలలో మంత్రి వాసంశెట్టి సుభాష్



**అమలాపురం, (రాజధాని వార్తలు):** యేసుక్రీస్తు బోధనల ద్వారా సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, కరుణ, ఐక్యతను పెంపొందిస్తాయని సాటి మనుషుల పట్ల ప్రేమ, దయ కలిగి వారిని ప్రేమించు అనే యేసుక్రీస్తు మాటలు సదా ఆచరణీయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని మద్దాలవారి పేట ఎంఎస్ఎన్ కాలనీ, బి ఎస్ ఆర్ కాలనీలో గురువారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పళ్ళంరాజుతో కలిసి మంత్రి సుభాష్ పాల్గొని మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలలో జరుపుకునే పండుగ క్రిస్మస్ అని యేసుక్రీస్తు చూపించిన ప్రేమ, కరుణ, దయ, శాంతి ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని మంత్రి సుభాష్ తన సందేశంలో పేర్కొన్నారు. క్రిస్మస్ పండుగ అందరి జీవితాల్లో సంతోషం, సుఖ శాంతులు నింపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని పేదలకు, వృద్ధులకు, వితంతులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆయా చర్చి పాస్టర్ల ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను మంత్రి సుభాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పళ్ళం రాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ కాపరులు, సంఘ పెద్దలు, క్రైస్తవ జనసమూహం, వాసంశెట్టి చినబాబు, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తెదేపా జిల్లా ఉపాధ్యక్షులుగా రంగనాగ్



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప తనయులు, పెద్దాపురం నియోజకవర్గ యువ నాయకులు నిమ్మకాయల రంగనాగ్ నియమితులైయ్యారు. ఈ మేరకు రంగనాగ్‌ను నియోజక వర్గ నాయకులు ఆయనను కలిసి ఘనంగా అభినందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రంగనాగ్‌ను జిల్లా ఉపాధ్యక్షులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు రంగనాగ్‌ను సామర్లకోట పట్టణ అధ్యక్షులు బడుగు శ్రీకాంత్, గౌరవధ్యక్షులు అడబాల కుమారస్వామి నియోజకవర్గ పరిధిలోని పలువురు పార్టీ నాయకులు పూలమాలలతో, పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

# మినీ ఫ్రాక్‌లో ఉప్పెన గాళ్ కవ్వింత



ఎరుపు రంగు గిఫ్ట్ ప్యాక్‌లతో అందమైన అమ్మాయి.. శాంటా క్యాప్.. స్ట్రాప్ లెస్ వైట్ మినీ డ్రెస్‌లో హొయలుపోతూ కనిపిస్తోంది. ఆ అందమైన మోములో కవ్వింత, బాడీ లాంగ్వేజ్‌లో తుళ్లింత కుర్రకారును విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. క్రిస్మస్ పార్టీని చాలా ప్రత్యేకంగా ప్లాన్ చేసినట్టే కనిపిస్తోంది ఈ బ్యూటీ. అలా అందంగా ఉల్లాసంగా బోల్డ్‌గా ఫోజులిచ్చిన ఈ అందాల సోయగం ఎవరో ప్రత్యేకించి పరిచయం అవసరం లేదు. ఉప్పెన గాళ్ కృతిశెట్టి. వైట్ హాఫ్ షోల్డర్ మినీ ఫ్రాక్‌లో గుబులు పుట్టిస్తున్న ఈ బ్యూటీ క్రిస్మస్ ఫోటోషూట్ ఇంటర్నెట్‌ని షేక్ చేస్తోంది. కృతి చూడటానికి ఎంత సింపుల్‌గా కనిపిస్తోందో, అంతకుమించి కవ్విస్తోంది. అందం ఆత్మవిశ్వాసం ఈ బ్యూటీలో మెండు అని నిరూపిస్తోంది. కెరీర్ మ్యాటర్‌కి వస్తే, ఉప్పెన తర్వాత ఈ బ్యూటీ ఆశించిన బ్లాక్ బస్టర్లు లేక చతికిలబడింది. అయినా నటిగా అవకాశాలకు కొదవేమీ లేదు. ప్రస్తుతం LIK చిత్రంలో ప్రదీప్ రంగనాథన్ సరసన నటిస్తోంది. ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది. కార్తీ సరసన నటించిన వా వాతియార్ విడుదల వాయిదా పడిన తర్వాత కృతి కొంత నీరసపడింది. నిర్మాతలు అప్పులు – ఆర్థిక కారణాల వల్ల ఈ సినిమాని డిసెంబర్‌లో విడుదల చేయలేకపోవడం నిరాశపరిచింది. మరోవైపు కృతి శెట్టి బ్రాండ్స్‌లోను దూసుకుపోతోంది. ఇటీవల పాపులర్ డ్యూరోఫ్లెక్స్‌కి బ్రాండ్ అంబాసిడర్‌గా సంతకం చేసింది. సోషల్ మీడియాల్లోను వాణిజ్య ప్రకటనలతో ఈ బ్యూటీ ఆర్జిస్తోంది. ఆన్‌లైన్ వేధింపులపై ఆవేదన: ఆన్‌లైన్ ద్వేషం, నిరంతర విమర్శలు తన మానసిక ఆరోగ్యంపై చూపే ప్రభావం గురించి కృతి శెట్టి ఇటీవల మాట్లాడింది. ట్రోలింగ్, చెడు మాటలు తనను ఎంతగా వేధించాయో కూడా వెల్లడించింది. ఉబికి వచ్చే కన్నీళ్లను ఆపుకోలేక, నిరంతరం ప్రజల జడ్జిమెంట్లు వినలేక చాలా ఆవేదనకు గురయ్యానని కృతి వెల్లడించింది. నా అదుపులో ఉండని విషయాలపైనా తిట్లు తిన్నాను. అది నన్ను చాలా వేధించిందని కృతి తెలిపింది. కొన్నిసార్లు చాలా తిరస్కరణను ఎదుర్కొంటాము. నేను సాధారణంగా చాలా ఆశావాదిని అయినా .. ఒక్కోసారి నన్ను నేను కోల్పోయినట్టు అనిపిస్తుంది.. అది నిరాశను కలిగిస్తుంది అని చెప్పింది. ఇలాంటి సమయాల్లో తన కుటుంబం, సన్నిహితుల మద్దతు, ముఖ్యంగా తన తల్లి మద్దతు తనకు సహాయపడిందని కృతి చెప్పింది.

కృతి శెట్టి 21 సెప్టెంబర్ 2003న కర్ణాటకలోని మంగళూరులో తుళు మాట్లాడే బంట్ కుటుంబంలో జన్మించింది. ఆమె తండ్రి వ్యాపారవేత్తగా రాణిస్తుండగా, తల్లి ఫ్యాషన్ డిజైనర్. కృతి ముంబైలో పెరిగింది. స్కూల్ డేస్‌లోనే వాణిజ్య ప్రకటనలలో నటించడం కొనసాగించింది.

# నాగ చైతన్య కోసం సితార పెద్ద సెటప్..!



సితార ఎంటర్టైన్మెంట్స్ టాలీవుడ్‌లో ప్రస్తుతం స్మాల్, మీడియం నుంచి భారీ బడ్జెట్ సినిమాలు చేస్తున్న నిర్మాణ సంస్థ. సూర్యదేవర నాగ వంశీ ఈ బ్యానర్‌లో వరుస సినిమాలు నిర్మిస్తున్నారు. ఐతే ఈ బ్యానర్‌లో మొదటి సినిమాగా వచ్చింది శైలజా రెడ్డి అల్లుడు. నాగ చైతన్యతోనే ఈ బ్యానర్ మొదలైంది. ఆ తర్వాత సక్సెస్‌ఫుల్ సినిమాలు చేస్తూ ఆడియన్స్‌ని అలరిస్తుంది. 2018లో నాగ చైతన్యతో శైలజా రెడ్డి అల్లుడు చేసిన సితార నాగ వంశీ ఈ ఏడేళ్లలో ఎన్నో సినిమాలు చేశారు. ఐతే మళ్లీ నాగ చైతన్యతో చేసే అవకాశం రాలేదు. నాగ చైతన్య కూడా తనతో బ్యానర్ మొదలుపెట్టి మరో సినిమా చేయట్లేదని నాగవంశీని అడుగుతున్నాడట. ఐతే ఆ విషయాన్నే రీసెంట్ ఇంటర్వ్యూలో ప్రస్తావించారు నాగ వంశీ. నాగ చైతన్య కోసం ఒక భారీ ప్లాన్ ఉందని అంటున్నారు నాగ వంశీ. నాగ చైతన్య 25వ సినిమా కోసం పెద్ద సెటప్ రెడీ చేస్తున్నామని అన్నారు. కుదిరితే 25వ సినిమా లేదంటే ఎప్పుడైనా సరే నాగ చైతన్యతో సినిమా మాత్రం వేరే లెవెల్‌లో ఉంటుందని అంటున్నారు నాగ వంశీ. ఎందుకంటే తమ తొలి సినిమా హీరో కాబట్టి కచ్చితంగా అతని మీద స్పెషల్ ఇంట్రెస్ట్ ఉంటుంది. నాగ చైతన్య కూడా తండేల్ తర్వాత కెరీర్ మీద మరింత ఫోకస్‌తో సినిమాలు చేస్తున్నాడు. ప్రస్తుతం కార్తీక్ దండుతో సినిమా చేస్తున్న చైతన్య నెక్స్ట్ సితారతో దాదాపు కన్ ఫర్మ్ అయినట్టే అని తెలుస్తుంది. ఐతే సితార బ్యానర్‌లో ఈసారి నాగ చైతన్య చేసే సినిమాకు డైరెక్టర్ ఎవరన్నది తెలియాల్సి ఉంది. పెద్ద సెటప్ అంటూ నాగ వంశీ చెప్పారు కాబట్టి కచ్చితంగా ఒక క్రేజీ కాంబినేషన్‌ను సెట్ చేసే ప్లానింగ్ ఉందని అర్ధమవుతుంది. ప్రస్తుతం అక్కినేని అఖిల్ తో సితార, అన్నపూర్ణ బ్యానర్లు కలిపి లెనిన్ సినిమా చేస్తున్నారు. నాగ చైతన్య సినిమా గురించి నాగ వంశీ చేసిన ఈ కామెంట్స్ అక్కినేని ఫ్యాన్స్‌ని ఖుషి చేస్తున్నాయి. ఆల్రెడీ తనకు ఎలాంటి కథలు సెట్ అవుతాయో అవే చేస్తున్నాడు నాగ చైతన్య. లవర్ బోయ్ ఇమేజ్‌తో డిఫరెంట్ సినిమాలు చేస్తున్న నాగ చైతన్య విరూపాక్ష డైరెక్టర్ కార్తీక్ దండు డైరెక్షన్‌లో వస్తున్న సినిమాతో థ్రిల్లర్ అటెంప్ట్ చేస్తున్నాడు. ఇక ఆ సినిమా తర్వాత తన మైల్ స్టోన్ మూవీ 25వ ప్రాజెక్ట్ ని భారీగా ప్లాన్ చేస్తున్నారని తెలుస్తుంది. మరి అది ఏ కాంబినేషన్‌లో వస్తుంది అన్నది చూడాలి.

# హీరోయిన్ మీనా కూతుర్ని చూశారా?



సోషల్ మీడియా వాడకం పెరిగిపోయిన తర్వాత సెలబ్రిటీలు ఈ సోషల్ మీడియా ద్వారానే తమ వారసులను పరిచయం చేస్తూ.. వారికంటూ ఒక ఇమేజ్ క్రియేట్ చేస్తున్నారు. మరి కొంతమంది తమ పిల్లలను చైల్డ్ ఆర్టిస్టులు గానే ఇండస్ట్రీలోకి ప్రవేశపెడుతున్నారు. అలాంటి సెలబ్రిటీల పిల్లలు ఒకప్పుడు చైల్డ్ ఆర్టిస్టులుగా నటించి.. సడన్గా ఇండస్ట్రీకి దూరమవుతారు. కానీ పెద్దయ్యాక వారు మళ్లీ మీడియా ముందుకు వస్తే వారిని చూసి ఆశ్చర్యం పడడం మన వంతు అనే చెప్పాలి. ఈ క్రమంలోనే ప్రముఖ సీనియర్ హీరోయిన్గా భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న మీనా రీఎంట్రీలో కూడా వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న విషయం తెలిసిందే. ఇక భర్త విద్యాసాగర్ మరణం తర్వాత ఆ కూతురుతోనే కలిసి ఉంటున్న ఈమె తన కూతురి ఫోటోలను ఇప్పటివరకు ఈ మధ్యకాలంలో షేర్ చేయలేదు. కానీ సడన్గా మీనా తన కూతురితో కలిసి దిగిన ఫోటో ఒకటి ఇప్పుడు సోషల్ మీడియాలో హల్చల్ కావడంతో మీనా కూతుర్ని చూసి అభిమానులే కాదు సినీ సెలబ్రిటీలు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. హీరోయిన్ రేంజ్‌లో ఉన్న ఈ అమ్మాయిని చూసి ప్రతి ఒక్కరు ఆశ్చర్యపోతున్నారు. ఒకప్పుడు చైల్డ్ ఆర్టిస్ట్‌గా ప్రేక్షకులను అలరించిన ఆ చిన్నారా ఈ అమ్మాయి అంటూ కామెంట్లు చేస్తున్నారు. విషయంలోకి వెళ్తే క్రిస్మస్ సందర్భంగా సీనియర్ నటి మీనాతో కలిసి దిగిన ఫోటోలను నైనిక కలిసి ఇప్పుడు సోషల్ మీడియాలో షేర్ చేసింది.. ఈ ఫోటో చూసి అభిమానులు త్వరలోనే నైనిక హీరోయిన్గా ఎంట్రీ ఇవ్వాలని అభిమానులు కోరుకుంటున్నారు. తల్లికి మించిన అందంతో ఉన్న ఈ అమ్మాయి హీరోయిన్గా ఎంట్రీ ఇస్తుందో లేదో అనేది తెలియాల్సి ఉంది. ఇకపోతే నైనిక ఐదు సంవత్సరాల వయసులోనే హీరో విజయ్ దళపతి నటించిన తేరి సినిమాలో బాలనటిగా కనిపించింది. ఆ సినిమా తర్వాత నటనకు గుడ్ బై చెప్పిన ఈమె చదువుపై ఫోకస్ చేసింది. ప్రస్తుతం ఈమె వయసు 14 సంవత్సరాలు. తాజా ఫోటోలు చూసిన అభిమానులు, నెటిజన్లు మాత్రం ఇండస్ట్రీలోకి తిరిగి రావాలని కోరుకుంటున్నారు. మీనా విషయానికి వస్తే.. 1982లో నెంజంగల్ అనే సినిమా ద్వారా బాలనటిగా తన కెరీర్‌ను ప్రారంభించింది. ముఖ్యంగా శివాజీ గణేషన్ చిత్రాలలో ఎక్కువగా నటించిన ఈమె బాలనటిగా 45 కు పైగా చిత్రాలలో నటించి ప్రేక్షకులను మెప్పించింది. 1990లో రాజేంద్రప్రసాద్‌తో పాటు తెలుగులో నవయుగం అనే సినిమాలో నటించింది. అదే సంవత్సరం తమిళంలో హీరోయిన్గా అడుగు పెట్టింది. ఇకపోతే తెలుగులో చంటి, అల్లరి పిల్ల, అల్లరి మొగుడు, సుందరకాండ, ప్రెసిడెంట్ గారి పెళ్ళాం ఇలా ఎన్నో చిత్రాలలో నటించింది మీనా. ముఖ్యంగా వెంకటేష్‌తో ఎక్కువ సినిమాలు చేసి బెస్ట్ ఆన్ స్క్రీన్ జోడిగా పేరు దక్కించుకున్నారు. రీఎంట్రీలో కూడా వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది మీనా. ఇక తన తదనంతరం తన కూతుర్ని కూడా ఇండస్ట్రీకి మళ్లీ తీసుకు రావాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# 2025లో అక్కడ బన్నీదే అగ్ర స్థానం!




2025 కొంత మందికి చేదు, మరి కొంత మందికి తీపి జ్ఞాపకాల్ని అందించింది. మరి కొన్ని రోజుల్లో ఈ ఏడాది ఎండ్ అయి న్యూయిర్‌కు యావత్ ప్రపంచం స్వాగతం పలకబోతోంది. ఈ సందర్భంగా 2025 సెర్చ్‌లో టాప్‌లో ట్రెండ్ అయిన టాలీవుడ్ స్టార్స్‌కు సంబంధించిన నివేదికని గూగుల్ తాజాగా విడుదల చేసింది. బ్లాక్ బస్టర్ రిలీజ్‌లు, స్టార్‌కున్న బజ్, మాసీవ్ ఫ్యాన్ బేస్ అని పరిగనలోకి తీసుకుంటూనే 2025 అత్యధికంగా గూగుల్‌లో అభిమానులు, సినీలవర్స్‌సెర్చ్ చేసిన స్టార్ల జాబితాని విడుదల చేసింది. ఈ లిస్ట్‌లో టాలీవుడ్‌కు సంబంధించిన టాప్ స్టార్స్ అల్లు అర్జున్, ప్రభాస్, మహేష్ బాబు, పవన్‌కల్యాణ్, ఎన్టీఆర్ టాప్‌లో నిలిచారు. ఈ టాప్ 5లో అత్యధికంగా అభిమానులు సెర్చ్ చేసిన స్టార్‌గా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మొదటి స్థానంలో నిలిచాడు. 2024లో బన్నీ నటించిన పుష్ప 2 భారీ స్థాయిలో పాన్ ఇండియా మూవీగా విడుదలై బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టించడమే కాకుండా అల్లు అర్జున్‌ని వివాదాల్లో నిలిచేలా చేసింది. బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించి బన్నీ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లని రాబట్టిన సినిమాగా సరికొత్త చరిత్ర సృష్టించింది. ఈ సినిమా ప్రీమియర్ కారణంగా జరిగిన తొక్కిసలాటలో ఓ యువతి మృతి చెందడం, ఆమె తనయుడు తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో సీరియస్‌గా తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం బన్నీపై కేసు ఫైల్ చేయడం, ఆ తరువాత జరిగిన నాటకీయ పరిణామాల మధ్య బన్నీ ఒక్క రోజు జైలు జీవితం అనుభవించడం తెలిసిందే. 'పుష్ప2'తో టాక్ ఆఫ్ ది ఇండియా అయ్యారు. దేశ వ్యాప్తంగా పాపులారిటీని సొంతం చేసుకున్న బన్నీ అందరి దృష్టిని ఆకర్షించారు. అదే ఫీవర్ 2025 వరకు కొనసాగింది. ఇక 'పుష్ప 2' తరువాత బన్నీ తమిళ డైరెక్టర్ అట్లీతో కలిసి భారీ పాన్ వరల్డ్ మూవీకి శ్రీకారం చుట్టడంతో 2025లో మళ్లీ టాక్ ఆఫ్ ది ఇండియాగా మారాడు బన్నీ. దీంతో 2025లో గూగుల్‌లో అత్యధికంగా ఆడియన్స్ సెర్చ్ చేసిన హీరోల్లో అల్లు అర్జున్ టాప్‌లో నిలిచాడు. ఈ ప్రాజెక్ట్‌పై సర్వత్రా ఎక్స్‌పెక్టేషన్స్ ఏర్పడటంతో అట్లీ, బన్నీ ప్రాజెక్ట్ ఇంటర్నెట్‌లో హాట్ టాపిక్‌గా మారింది. అంతే కాకుండా బన్నీ పవర్ ఫుల్ లైనప్‌తో రెడీ అవుతున్నాడంటూ వర్తలు షికారు చేయడం, త్రివిక్రమ్ భారీ ప్రాజెక్ట్‌లో భాగంగ అవుతున్నాడని ప్రచారం జరగడంతో అల్లు అర్జున్ 2025లో గూగుల్‌లో మోస్ట్ సెర్చ్‌డ్ టాలీవుడ్ సెలబ్రిటీగా నిలిచాడు. ఇక ఈ లిస్ట్‌లో రెండవ స్థానంలో నిలిచింది ప్రభాస్. కన్నప్ప, బాహుబలి: ది ఎపిక్, ది రాజా సాబ్, స్పిరిట్, ఫౌజీ సిపిమాలతో నెట్టింట ఈ ఏడాది అంతా ట్రెండ్ అవుతూనే ఉన్నాడు. సూపర్ స్టార్ మహేష్ బాబు వారణాసిలో నటిస్తున్న విషయం తెలిసిందే. జక్కన్నతో కలిసి తొలి పాన్ ఇండియా మూవీ చేస్తుండటం, ఈ ప్రాజెక్ట్ హాలీవుడ్ దిగ్గజం జేమ్స్ కామెరూన్ దృష్టిని ఆకర్షించడం, ఐమ్యాక్స్ ఫార్మాట్ మూవీ కావడం, అత్యంత భారీ బడ్జెట్‌లో రూపొందుతుండటంతో ఈ ప్రాజెక్ట్‌తో మహేష్ వార్తల్లో నిలిచాడు. ఓజీతో పవన్, వార్ 2తో ఎన్టీఆర్ ఈ ఏడాది గూగుల్‌లో మోస్ట్ పెర్చ్‌డ్ టాలీవుడ్ స్టార్స్‌గా నిలవడం విశేషం.

# సెంట్రల్ లైటింగ్ ప్రారంభించిన ఎమ్మెల్యే - దేశ నేతల విగ్రహాలకు విద్యుత్ అలంకరణ





**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట పట్టణం మెహర్ కాంప్లెక్స్ సెంటర్, బ్రౌన్‌పేట సెంటర్లలో ఏర్పాటు చేసిన సెంటర్ లైటిం గ్‌ను, పట్టణ పరిధిలో ఉన్న దేశ నేతల విగ్రహాలకు ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలను పెద్దాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప బుధవారం రాత్రి ప్రారం భించారు. మున్సిపాలిటీ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలోని ప్రధాన రహదారుల డివైడర్ల మధ్య ఈ ఆధునిక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే చిన రాజప్ప తెలిపారు. దీని ద్వారా రాత్రి వేళల్లో వాహనదారులు, పాదచా రులకు మరింత భద్రత లభించడంతో పాటు పట్టణ సుందరీ కరణకు కూడా ఈ సెంటర్ లైటింగ్ ఉపయోగపడుతుందన్నారు. పట్ట ణాన్ని మరింత ఆకర్షణీయంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులు కొనసాగుతు న్నాయని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్పర్సన్ గంగిరెడ్డి అరుణ, మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, సీఐ ఏ కృష్ణ భగవాన్, టిడిపి నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, అందుగుల జార్జి చక్రవర్తి, కంటే జగదీష్ మోహన్ (బాబు), బలుసు వాసుతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# అటల్ బీహారీ వాజ్పేయి పాలన ప్రపంచానికే ఆదర్శం



**గూడూరు, (రాజధాని వార్తలు):** మాజీ ప్రధాని భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు అటల్ బీహార్ వాజ్పేయి పరిపా లన దేశానికి ప్రపంచానికి ఆదర్శమని గూడూరు నగర బిజెపి అధ్యక్షులు కే దయాకర్ పేర్కొన్నారు గురువారం గూడూరు నగర బిజెపి కార్యాలయంలో బిజెపి అధ్యక్షులు కే దయాకర్ ఆధ్వర్యంలో అటల్ బీహారీ వాజ్పేయి 100వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా అటల్ బీహారీ వాజ్పేయి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు అనంతరం బిజెపి అధ్యక్షులు మాట్లాడుతూ అటల్ బీహారీ వాజ్పేయి విద్యార్థి దశనుండే రాజ కీయాల వైపు మొగ్గు చూపి ప్రజా సేవ చేయాలనే తపన పడేవా రున్నారు ఆ క్రమంలోనే ఏబీవీపీ నాయకుడుగా బీజేవైఎం నాయ కుడిగా అనంతరం భారతీయ జన సంఘ్‌ను స్థాపించి ఒక తర్వాత భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులుగా నిలిచా రన్నారు. ఎన్నో ఏళ్లుగా దేశంలో పాలన సాగిస్తున్న కాంగ్రెస్ పార్టీని మంటగలిపే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో 1999లో అటల్ బీహార్ వాజ్పేయి దేశ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు అన్నారు. ఆయన చేపట్టిన అనేక సంస్కరణలో భాగంగా జాతీయ రహదారుల విస్తరణ, మరెన్నో సంస్కరణలను చేపట్టారన్నారు. ఆయన పాటలోనే దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ పాలన సాగిస్తున్నారని భారతీయ జనతా పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు ఆరికట్ల బాలకృష్ణ నాయుడు నగర పార్టీ ప్రధాన కార్యదర్శిలు బాలకృష్ణ గౌడ్, రవీంద్ర ఉపాధ్యక్షులు గుమ్మడి శ్రీనివాస్ యాదవ్, కోశాధికారి నిరంజన్ ఓబీసీ మోర్చానాయకులు ఒకటి కటికాల సురేష్, నగర కార్యదర్శి భార్గవ్ చౌదరి, మహిళా మోర్చా నాయకులు బాలామణి, సీనియర్ బిజెపి నాయకులు తాటిపర్తి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులకు దుస్తులు పంపిణీ

**చిట్టమూరు, (రాజధాని వార్తలు):** క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులం దరూ సంతోషంగా జరుపుకోవాలన్న ఉద్దేశంతో మండలంలోని ఆరూరు ఎంపీటీసీ భార్గవి, తెలుగుదేశం పార్టీ మండల కార్య దర్శి గిరిబాబు నాయుడు దంపతులు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక పెద్ద హరిజనవాడ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ సంబరాల్లో ఆరూరు దంపతులు పాల్గొన్నారు. గ్రామంలోని పెద్ద హరిజనవాడ కుటుంబాలకు ఇరవై వేలు రూపాయలు విలువైన దుస్తులు, పండ్లను పంపిణీ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియ జేశారు. 9 సంవత్సరాల నుండి క్రమం తప్పకుండా పెద్ద హరిజన వాడలోని ప్రతి కుటుంబానికి క్రిస్మస్ సందర్భంగా దుస్తులు పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం అన్ని కుటుంబా లకు దుస్తులు, పండ్లతో పాటు పదివేల రూపాయల విలువైన డిజిటల్ మైక్ సెట్‌ను ప్రార్థనా మందిరానికి అందజేశారు. దయార్థ హృదయుడైన యేసుక్రీస్తు కరుణా కటాక్షాలు అందరిపై



ఉండాలని ఆకాంక్షించిన వారు ఈ ప్రాంతం ప్రజలు, రైతులు, అధికారులు, మిత్రులు సుఖసంతోషాలతో వర్ధిల్లాలన్నారు.

# సిపిఎం మాజీ జిల్లా కార్యదర్శి పుల్లయ్యకు సతీ వియోగం



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా సిపిఎం మాజీ కార్యదర్శి, ప్రస్తుత కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్యకు సతీ వియోగం కలిగింది. ఆయన భార్య అంగేరి మునెమ్మ(54) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. రాజీవ్ నగర్‌లోని పుల్లయ్య నివాసంలో మునెమ్మ అంత్యక్రియలు నిర్వహిం చగా పలువురు ప్రముఖులు మృతదేహానికి నివాళులు అర్పించారు. ముందుగా తిరుపతి జిల్లా సిపిఎం కమిటీ ఆధ్వర్యంలో మునెమ్మ మృతదేహంపై ఎర్ర జెండా కప్పి జోహార్లు అర్పించారు. మునెమ్మ అమర్ రహే అంటూ నినదించారు. అనంతరం పుల్లయ్యకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరుస్తూ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్, చిత్తూరు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి డాక్టర్ బత్తెయ్య నాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి మురళీ, ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య, సీపీఎం ప్రాం తీయ కార్యదర్శి గంధం మణి, దాసరి జనార్ధన్, పెనగడం గురువయ్య, రెడ్డిపల్లి సురేష్, గెడి వేణు తదితరులు మునెమ్మకు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

**మునెమ్మ ఆదర్శ గృహిణి వందవాసి**

అంగేరి మునెమ్మ ఆదర్శ గృహిణి అని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. భర్త పుల్లయ్య త్యాగాల్లో, పోరాటాల్లో, ఉద్యమాల్లో తనవంతు మద్దతుగా నిలిచిందని కొనియాడారు. జీవిత కాలం సీపీఎం సభ్యురాలుగా ఉంటూ భర్త కష్ట, సుఖాల్లో పాలు పంచుకుందనీ, ఐద్వా పోరాటాల్లో చురుకైన పాత్ర పోషించిందని గుర్తు చేశారు. ఓ వైపు గృహిణిగా ఉంటూనే మరోవైపు ఉద్యమాల వెంట నడిచిన మునెమ్మ మృతి సీపీఎం కు తీరని లోటని వాపో యారు. ఆమె ఆశయాల సాధన కోసం పాటుపడతామని అన్నారు.

# ఆనందోత్సాహాలతో క్రిస్మస్ వేడుకలు...! - వస్త్రదానాలు, ఆటలు పోటీలతో సందడి





**సామర్లకోట, (రాజధాని వార్తలు):** మన జీవితాలు ఆనందమయం కావాలంటే సృష్టికర్త అయిన యేసుక్రీస్తు మన జీవితానికి ఒక చుక్కానిగా ఏర్పాటు చేసుకోవాలని ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి కాపరి రెవ. బి వి రాజు అన్నారు. యేసుక్రీస్తు జన్మదిన వేడుకలైన క్రిస్మస్ వేడుకలను క్రైస్తవ ప్రజలు గురువారు ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. పెద్దాపురం నియోజక వర్గ పరిధిలో 200లకు పైబడి క్రైస్తవ దేవాలయాలుండగా అన్ని దేవాలయాల్లో ఈ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దైవజనులు ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ మానవుల పాపాలను పరిహరిం చడానికి దీనునిగా యేసుక్రీస్తు ఈ లోకంలో జన్మించినట్టు చెప్పారు. దీనులకు న్యాయం తీర్చుటకు, మనకు ఘనతను ఇచ్చేందుకు, మనిషికి స్వతంత్రత ఇచ్చేందుకు, పరలోకానికి మనలను చేర్చేందుకు యేసుక్రీస్తు భూలోకానికి వచ్చినట్టు చెప్పారు. కాగా ప్రధానంగా సామర్లకోట పట్టణంలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి, ఆగస్తానా లూథరన్ చర్చి, ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి, ట్రూ గాస్పెల్ చర్చి, షాలేం బాప్టిస్ట్ చర్చి, బెరకా బాప్టిస్ట్ చర్చి, పెద్దాపురం పట్టణం లోని బైబిల్ మిషన్ చర్చిలు, లూథరన్ చర్చిలతో పాటు రెండు పట్టణాల్లోని అన్ని దేవాలయాల్లో లోక రక్షకుడు అయిన యేసుక్రీస్తు జన్మదిన వేడుకలు ఘనంగా జరుపు కున్నారు.

**వస్త్రదానాలు, ఆటల పోటీలు :**

క్రిస్మస్ వేడుకల్లో భాగంగా పలు దేవాలయాల్లో పేదలకు, వృద్ధులకు వస్త్ర దానాలు, ప్రజలకు ఆటల పోటీల కార్యక్రమా లను నిర్వహించారు. చర్చిలోకి చెందిన నాయకులు, అతిధుల చేతుల మీదుగా ఈ కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో జరిగిన ఈ ఆటల పోటీల్లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలందరికీ 2026 నూతన సంవత్సర వేడుకల్లో బహుమతులను అందించనున్నట్టు సంఘాల నాయకులు తెలిపారు. ఈ వేడుక ఈ వేడుకల్లో సంఘ నాయకులు బిఎస్ వందనం, టి సూర్యారావు, జి అన్నపూర్ణ డేనియల్, పిట్టా సత్యనారాయణ, టి అమర్ కళ్యాణ్, డిజి రాజేశ్వరరావు, ఎన్ పున్నమి చంద్రుడు, ఎండి వి ప్రసాద్, సామర్లకోట మండల పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు ఏ చంటి, పి ఆనంద్ బాబు, బైబిల్ మిషన్ కాపరి జి ఆర్ ఎమ్మా నుయేల్, లూథరణ చర్చ్ దైవజనులు సామ్యూల్ ప్రకాష్, ప్రభాకర్, లంకా పురుషోత్తం దాసు, కుమార్, ఎం సాల్మన్ రాజు, ఆర్ లాజారస్, వి జాన్, ఆయా సంఘాల దైవజనులు, నాయ కులు, క్రైస్తవ ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు యూనిఫామ్ అందజేత



**చిట్టమూరు, (రాజధాని వార్తలు):** చిట్టమూరు మండలం చిట్టమూ రులో భవిత దివ్యాంగుల స్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఆర్టిఐ అండ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ ఎస్ కే జిలాని భాష పాల్గొని విద్యార్థులకు యూనిఫామ్ అందచేశారు ఏపీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ మురారి మధు వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం సురేందర్ రెడ్డి స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ మస్తాన్ మరియు మండల ఎంఈఓ వెంకటకృష్ణయ్య మాజీ ఎంఈఓ ప్రసాద్ ఐ ఆర్ టి జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి మరియు ఇతర ఉ న్నతాధికారులు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం నాయుడుపేట అమ్మ ఫౌండేషన్ అధ్యక్షురాలు కృష్ణవేణి అమ్మగారు అక్కడ చదువుతున్న దివ్యాంగులకు బట్టలు పంచడం జరిగింది. అనగా స్కూల్ యూనిఫామ్స్ మరియు ప్లేట్స్ గ్లాసులు కృష్ణవేణమ్మ చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది.

# క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న బియ్యపు మధుసూదన్ రెడ్డి, అంజూరు తారక శ్రీనివాసులు

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి పట్టణంలో కాసా గార్డెన్ వద్ద వున్న చర్చిలో క్రిస్మస్ సందర్భంగా శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి, శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అం జూరు తారక శ్రీనివాసులు పాల్గొని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిం చారు. అలాగే క్రిస్టియన్ సోదరీ సోదరీమణులకు క్రిస్మస్ శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ జీసస్ ప్రేమ, అను రాగం, దయా, కరుణకు ప్రతిరూపమని, ఈ పండుగను మీ అందరి మధ్య జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ జీసస్ త్యాగానికి ప్రతిరూపమని మనిషి చేసిన తప్పులను క్షమించే గుణం ఉన్న గొప్ప దైవం జీసస్ అన్నారు. అనంతరం క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్




శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ సిరాజ్ భాష, ముద్దుమూడి రవి, శ్రీవారి సురేష్, కంటా ఉదయ్ కుమార్, పటాన్ ఫరీద్, బాల్ శెట్టి విజయ్ శేఖర్, డాక్టర్ శంకర్, డాక్టర్ యశ్వంత్ రెడ్డి, కొల్లూరు హరినాథ్ నాయుడు, పసల సురేష్, సిఆర్డి, రమణ, రంగయ్య, ప్రియా, తదితరులు పాల్గొన్నారు.

# పెళ్ళేరు గ్రామంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



**చేజర్ల, (రాజధాని వార్తలు):** పవిత్ర క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరిం చుకుని చేజర్ల మండలంలోని పెళ్లేరు గ్రామ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో ఏపీ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ సల్మా షిరీన్ పాల్గొన్నారు. ఈ సందర్భం గా క్రైస్తవ సోదరులతో కలిసి ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జీసస్ క్రీస్తు చూపించిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకుంటూ ప్రేమ, శాంతి, సౌభ్రా తృత్వాన్ని పెంపొందించాలని సూచించారు. మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రత్యేకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, కిమ్స్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాళ్లూరి గిరినాయుడు నాయకత్వంలో ఆత్మకూరు నియోజకవ ర్గంలో మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్ర మాలు అమలు చేస్తున్నందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రావి పెంచలరెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు షేక్ సిరాజుద్దీన్, మండల సీనియర్ నాయకులు రావి లక్ష్మీ నర్సారెడ్డి, కోనంకి బాబు, చర్చి పాస్టర్ ఒడిగి రవీంద్ర బాబు, ముస్లిం మైనారిటీ యువ నాయకులు మస్తాన్ షరీఫ్, కొప్పాల శ్రీను, అభిరామ్, క్రైస్తవ సోదరులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎన్ఫ్లానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


## భూ ప్రకంపనలు.. భయంతో ఇళ్ల నుంచి జనం పరుగు

**గాంధీనగర్:** గుజరాత్‌లోని కచ్ జిల్లాలో భూ ప్రకంపనలు సంభవించాయి. శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటలకు ఈ ప్రకంపనలు వచ్చాయి. ఈ భూ ప్రకంపనల తీవ్రత రిక్టర స్కేలుపై 4.4 గా నమోదు అయింది. ఈ మేరకు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది. ఈ భూ ప్రకంపల కేంద్రాన్ని గుర్తించినట్లు వివరించింది.

23.65 డిగ్రీల నార్త్ లాటిట్యూడ్, 70.23 ఈస్ట్ లాంగిట్యూడ్ మధ్య 10 కిలోమీటర్ల లోతులో ఈ భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు వెల్లడించింది. ఈ భూ ప్రకంపనలు సంభవించిన వెంటనే ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ ప్రకపంనల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించినట్లు ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం అందలేదని ఉన్నతాధికారులు వివరించారు. మరోవైపు ఈ కచ్ జిల్లాలో తరచూ భూ ప్రకంపనలు సంభవిస్తున్న సంగతి తెలిసిందే. కానీ స్వల్ప భూ ప్రకంపనలతో ఇక్కడ భూకంపాలు సంభవిస్తు న్నాయి. 2001లో గుజరాత్‌లో భారీ భూకంపం సంభవిం చిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వేలాది మంది ప్రాణాలు కోల్పోగా..లక్షలాది మంది గాయపడ్డారు. ఈ వరుస భూప్రకంపనల కారణంగా..స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

## వెంకటేశ్వర స్వామికి పరశురామ అవతారం



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగే 85వ వార్షిక దశావతార మహోత్సవాల్లో భాగంగా అయిదవరోజు ఆరోరోజు గురువారం వెంకటేశ్వర స్వామి పరశురామావతారంలో భక్తులకు దర్శనమి చ్చారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి కే జగదీశ్వరరావు, ఆలయ చైర్మన్ జల్లూరి వీర్రాజుల ఆధ్వర్యంలో మహోత్సవాల్లో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామిని పరశురామావతారంలో ప్రత్యేక రీతిన అలంకరించి విశేష పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ అధికారి మాట్లాడుతూ ముఖ్యమైన పర్వదినాల్లో స్వామి వారిని పది అవతారాల్లో అలంకరించి విశేష పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పూజల్లో భాగంగా రాత్రి ఆలయంలో స్వామివారికి ఊయల సేవ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక భజనా కార్యక్రమం నిర్వహించగా ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక అలంకరణలో ఉన్న వెంకటేశ్వర స్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ అధికారులు ప్రత్యేక ప్రసాదాలను అందజేశారు.

## నెల్లూరు జిల్లా టిడిపి అధ్యక్షులుగా బీద రవిచంద్ర

**గూడూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా మూడవసారి బీద రవిచంద్ర పదవీ బాధ్యతలు చేపట్టారు. గూడూరు నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్‌తో కలిసి చిల్లకూరు మండల పార్టీ నాయకులు బీద రవిచంద్రను నెల్లూరులోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. బీద రవిచంద్రకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో చిల్లకూరు మండలం పార్టీ ప్రధాన కార్యదర్శి నెలటూరు చిరంజీవి, క్లస్టర్ 7 కో కన్వీనర్ వరగలి మాజీ సర్పంచ్ మూగ శంకరయ్య, మోమిడి మాజీ సర్పంచ్ మేఘనూరు వెంకటకృష్ణయ్య, తమ్మిన పట్నం కోదండరామాలయం దేవస్థానం చైర్మన్ కోట సతీష్ యాదవ్ పార్టీ నాయకులు ఉన్నారు.


## గిరి ప్రదక్షిణ బాటలో ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయండి



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** ప్రదక్షిణ బాటలో ఆకతాయిల ఆగడాలకు అడ్డు కట్ట వేయాలని ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు గరికిపాటి రమేష్ బాబు ఆధ్వర్యంలో ఆలయ పాలక మండలి చైర్మన్ కొట్టే సాయికి విన్నవించారు. ఈ సందర్భంగా వారు చైర్మన్, ఈఓలతో మాట్లాడుతూ దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ప్రతియేట శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం వారు సంప్రదాయబద్ధంగా ఎంతో వైభ వంగా రెండు పర్యాయములు సంక్రాంతి, కనుమ పర్వదినంలో ఒకసారి, శివరాత్రి సమయంలో రొండోసారి గిరి ప్రదక్షణ నిర్వహి స్తారన్నారు. మోతగాళ్ళచే స్వామి అమ్మవార్లను మోసుకుని గిరి ప్రదక్షణ చేస్తారని, ఆ ఆదిదంపతుల వెంట వేలసంఖ్యలో భక్త జనం గిరి ప్రదక్షణకు వెళుతుంటారన్నారు. ఇదివరకు పిచ్చాటూరు మార్గంగుండా తారు రోడ్డు మీదుగా స్వామి అమ్మవార్లు భక్తులు గిరి ప్రదక్షణ చేసేవారని, ఆ మార్గం గుండా వాహనాలు రాక పోకలు ఎక్కువగా ఉండడం, ప్రమాదాలు జరగడం వంటి వాటిని దృష్టిలో ఉంచుకొని గిరి ప్రదక్షణకు వెళ్ళే భక్తుల సౌకర్యార్థం దేవస్థానం వారు కొండలను ఆనుకొని కోట్లు రూపాయలు ఖర్చు చేసి రహదారిని నిర్మించడం జరిగిందన్నారు. కానీ ఈ మార్గంగుండా గిరి ప్రదక్షణ సమయంలో ఎక్కువ సంఖ్యలో వాహనాలు రావడం, ఆకతాయిలు, అల్లరి మూకలు అధిక శబ్దంతో హారన్స్ కొడుతూ అతి వేగంతో బైక్స్ నడుపుతూ నడిచివేళ్లే భక్తులను ఇబ్బంది పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ కారణం చేత కార్లు, బైక్స్, ఆటోలు వంటి వాహనాలను దేవస్థానం వారు గిరి ప్రదక్షణ కొరకు నిర్మించిన మార్గం గుండా అనుమతించకుండా పిచ్చాటూరు మార్గం తారు రోడ్డు మీదుగా ఆ వాహనాలను గిరి ప్రదక్షణ రోజు మళ్లించాలని కోరుతూ తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణ హిందూ ధార్మిక మండలి కన్వీనర్ గరికపాటి రమేష్ బాబు, వారి మిత్ర బృందంతో కలిసి శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ఈ.ఓ బాపి రెడ్డి, ధర్మకర్తల మండలి అధ్యక్షులు కొట్టే సాయి ప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులు కోలా విశాలాక్షి వారికి వినతి పత్రం ఇచ్చారు. ఈ విషయంపై వారు సానుకూలంగా స్పందిస్తూ రహదారిని పరిశీలించి తగు జాగ్రత్తలు తప్పకుండా తీసుకుంటామని అవసరమైతే రమేష్ బాబు సహాయంకుడా తీసుకుంటామని, ఇటువంట మంచి సలహాలు సూచనలు తమకు ఎల్లవేళల అందించాలని కోరు కుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గరికిపాటి రమేష్ బాబు, చిలకా రంగయ్య, గోపాలయ్యా, కన్నా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## మంచుతో మండల ప్రజలు ఇబ్బందులు

**చిట్టమూరు, (రాజధాని వార్తలు):** మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వడగండ్ల మంచు మరియు తీవ్రమైన చలి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. తెల్లవారుజామున దట్టమైన మంచు కూర్పు కారణంగా రోడ్లపై చూడటానికి కూడా ఇబ్బందిగా మారింది. దీంతో ప్రయాణీకులు, కూలీ కూలీలు,పంట పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలి తీవ్రత కారణంగా పాఠశాలకు వెళ్లే విద్యార్థులు,పెద్దలు గాఢమైన దుస్తులు ధరించాల్సి వస్తుంది. ఉదయం బస్సులు,ఆటోలు ఆలస్యంగా నడవ డంతో కాలేజీ విద్యార్థులు, రవాణా చేసే ప్రజలు ఇబ్బంది పడుతు న్నారు. స్థానిక వైద్యాధికారులు చలి సమయంలో పెద్దవారు, చిన్న పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరం లేకుండా బయట తిరగవద్దని సూచించారు. మండల ప్రజలు మంచు తగ్గి వాతావర ణం సాధారణ స్థితికి రావాలంటూ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan